

మరిన్ని కథనాల
కోసం
యూట్యూబ్‌లో
ప్రసారమవుతున్న
మీ
SREECHAKRA
NewsTVని
వీక్షించవచ్చు.
ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,

https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 203 | కర్నూలు | శనివారం ఆగష్టు 23 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi







## త్వరలో జనాభా మిషన్: ప్రధాని మోదీ

గయా జీ (బీహార్), ఆగస్టు 22 : దేశంలోకి అక్రమ వలసదారుల జనాభా పెరగడం ఆందోళన కలిగించే విషయమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి తాను ఒక జనాభా మిషన్‌ను ప్రతిపాదించానని, ఇది త్వరలో తన పనిని ప్రారంభిస్తుందని బీహార్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. బీహార్ సరిహద్దు ప్రాంతాల్లో జనాభా వేగంగా మారుతోందని దేశంలోకి వస్తున్న చొరబాటుదారులు బీహార్ రాష్ట్ర ప్రజల హక్కులను లాక్కోవడానికి అనుమతించబోమని ప్రధాని చెప్పారు. కాంగ్రెస్, ఖీఏఆ పార్టీలు తమ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి తమ బుజ్జగింపు విధానాలు అవలంభిస్తున్నాయని మోదీ చెప్పారు. ఇందులో భాగంగానే బీహార్ ప్రజల హక్కులను హరించి, అక్రమ వలసదారులకు ఇవ్వాలని కాంగ్రెస్, ఆర్జేడీలు కోరుకుంటున్నాయని ప్రధాని ఆరోపించారు. బీహార్ లోని గయా జీలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించిన మోదీ..'డబుల్ ఇంజిన్' ఔఆం ప్రభుత్వం ఈ ఆటలు సాగనివ్వదని పేర్కొన్నారు. భారతీయులకు ఉద్దేశించిన అవకాశాలను అక్రమ వలసదారులు లాక్కుంటుంటే చూస్తూ ఊరుకోబోమని, దేశ భవిష్యత్తును పరాయివాళ్ల చేతుల్లో పెట్టనివ్వమని తేల్చిచెప్పారు. కొత్తగా ప్రారంభించిన 'హై-పవర్ డెమోగ్రఫీ మిషన్' గురించి ప్రస్తావిస్తూ మోదీ.. ఈ మిషన్ త్వరలో ప్రారంభమవుతుందని, ఈ ప్రభుత్వం భారతదేశం నుండి 'ప్రతి అక్రమ వలసదారుడిని తరిమివేస్తుందని' ప్రధాని మోదీ అన్నారు. 'ఈ ముప్పును ఎదుర్కోవడానికి, నేను ఒక జనాభా మిషన్‌ను ప్రారంభించాలని ప్రతిపాదించాను. ఈ మిషన్ త్వరలో తన పనిని ప్రారంభిస్తుంది. మేము ప్రతి వలసదారుడిని తరిమివేస్తాం. దేశంలోని ఈ వలసదారుల మద్దతుదారుల పట్ల బీహార్ ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్, ఆర్జేడీ బీహార్ ప్రజల హక్కులను లాక్కొని, చొరబాటుదారుల్ని సంతృప్తి పరచడానికి, వారి ఓటు బ్యాంకును పెంచుకోవడానికి ఆ పార్టీలు చూస్తున్నాయి' అని ప్రధాన మంత్రి అన్నారు.

## రాధాకృష్ణన్.. దేశానికి , ఉపరాష్ట్రపతి పదవికి గౌరవం తెస్తారు: సీఎం చంద్రబాబు



ఢిల్లీ, ఆగస్టు22: ఎన్డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కలిసి సీపీ రాధాకృష్ణన్‌ను ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేశాయని క్లారిటీ ఇచ్చారు. రాధాకృష్ణన్‌తో ఎప్పటి నుంచో తనకు పరిచయం ఉందని గుర్తుచేసుకున్నారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తన మద్దతును తెలియజేశానని పేర్కొన్నారు. దేశంలో గౌరవించ దగ్గ వ్యక్తి, అత్యున్నత స్థానానికి మంచి అభ్యర్థి, దేశానికి గౌరవం తీసుకొస్తారని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు. సీపీ రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతి కుర్చీకి ప్రతిష్ట పెంచుతారని.. అలాంటి వ్యక్తికి మద్దతు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు. తనకు రాజకీయాలు ముఖ్యం కాదని, తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు నుంచి ఎన్డీఏ కూటమితో పొత్తులో ఉందని ఉద్ఘాటించారు. ఒకసారి ఎన్డీఏ అభ్యర్థి పెట్టిన తర్వాత ఓడిపోతామనే తెలిసి ఇండియా కూటమి మళ్లీ అభ్యర్థిని పెట్టడం ఎందుకు? అని ప్రశ్నించారు సీఎం చంద్రబాబు. గెలిచే అవకాశం లేకపోయినా అభ్యర్థిని పెట్టి ఇండియా కూటమి రాజకీయం చేస్తోందని విమర్శించారు. ఎన్డీఏలో ఉన్నపుడు ప్రతిపక్ష అభ్యర్థికి ఎలా మద్దతు ఇస్తామని ప్రశ్నించారు. గతంలో పీవీ నరసింహారావుకు నాటి సందర్భంలో తెలుగువారు అనే ఉద్దేశంతో కాంగ్రెస్‌లో ఉన్న తెలుగుదేశం మద్దతు తెలిపిందని స్పష్టం చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు ఎన్డీఏ కూటములేనని.. అలాంటి సందర్భంలో మద్దతు ఆశించడం , మాట్లాడటం సరికాదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## టీచర్ ఉద్యోగార్థులకు గుడ్ న్యూస్.. మంత్రి లోకేష్ కీలక ప్రకటన




అమరావతి, ఆగస్టు22: ఇకపై టీచర్ పోస్టుల భర్తీకి ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారాలోకేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యలో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు గత 14నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేశామని ఉద్ఘాటించారు. ఫలితాలు రాబట్టే బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులదేనని దిశానిర్దేశం చేశారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాంశాలల్లో కీలక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని నొక్కిచెప్పారు. అమరావతిలో ఏడాదిలోగా సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విద్యా శాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ ఏపీ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఏపీ చరిత్రలో తొలిసారిగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి, విజయవంతంగా నిర్వహించామని వ్యాఖ్యానించారు మంత్రి నారాలోకేష్. అనవసరమైన శిక్షణా కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేయొద్దని సూచించారు. సంస్కరణల అంతిమ లక్ష్యం అభ్యసన ఫలితాలేనని తెలిపారు. అసర్ నివేదిక ప్రకారం ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) ప్రోగ్రామ్ అమల్లో జాతీయస్థాయిలో ఏపీ 14వ స్థానంలో ఉందని ఉద్ఘాటించారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలని... మెరుగైన ర్యాంక్ సాధించేందుకు నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు మంత్రి నారాలోకేష్.

## సాస్కి కింద అదనంగా ఐదు వేల కోట్లు ఇవ్వండి: ఢిల్లీలో చంద్రబాబు



అమరావతి, ఆగస్ట్ 22 : ఢిల్లీ వెళ్లిన ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రాష్ట్రంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించవలసిందిగా కేంద్ర ఆర్థికమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటివరకు ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం పథకం కింద రూ. 2,010 కోట్లు లభించాయని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మూలధన ప్రాజెక్టుల కోసం అదనంగా రూ. 5,000 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రికి వినతి పత్రం సమర్పించారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ (రాఔం ంాజూజీతీబష్ట) ప్రోత్సాహక పథకం మార్గదర్శకాల ప్రకారం రూ. 250 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై తగు ఉత్తర్వులు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకాన్ని స్వాగతిస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి..ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందగలదని తెలిపారు. దీని విధివిధానాలు రూపొందించి త్వరగా ఈ పథకాన్ని అమల్లో తేవాలని ముఖ్యమంత్రి కోరారు.

## లైసెన్సు తీసుకున్న కేబుల్ తప్ప ఏవీ ఉంచొద్దు...

### హైకోర్టు కీలక ఆదేశాలు




హైదరాబాద్, ఆగస్టు22: నెట్‌వర్క్ కేబుల్ వైర్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో మరోసారి విచారణ జరిగింది. రామంతాపూర్ ఘటన తర్వాత హైదరాబాద్‌లోని పలు ఏరియాల్లో కేబుల్ వైర్లను విద్యుత్ అధికారులు కట్ చేశారు. వైర్లకు తిరిగి కనెక్షన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని ఎయిర్‌టెల్ సంస్థ కోరింది. అయితే, ఎయిర్‌టెల్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. లైసెన్సు తీసుకున్న కేబుల్స్ తప్ప ఏవీ ఉంచవద్దని జస్టిస్ నగేష్ భీమాపాక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటంపై జస్టిస్ నాగేష్ భీమాపాక సీరియస్ అయ్యారు. రామంతాపూర్‌లో ఐదుగురు మరణించిన ఘటనను ఈ సందర్భంగా జడ్జి ప్రస్తావించారు. పుట్టిన రోజు నాడే తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడు ఘటనపై జడ్జి ఉద్వేగ భరిత వ్యాఖ్యలు చేశారు. కేకు కోయాల్సిన తొమ్మిదేళ్ల బాలుడు తలకొరివి పెట్టడం తనను తీవ్రంగా కలచి వేసిందని జస్టిస్ నగేష్ భావోద్వేగానికి గురయ్యారు. విద్యుత్ ప్రమాదంపై ఎవరికి వారు చేతులు దులుపుకుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలకు బాధ్యులు ఎవరని జస్టిస్ నగేష్ భీమాపాక ప్రశ్నించారు. ఈ ఘటనతో ప్రతి హృదయం పగిలిపోయిందని.. అందరం బాధ్యులమేనని జస్టిస్ నగేష్ పేర్కొన్నారు. ఈ విషయంలో సమాజం సిగ్గుతో తలదించుకోవాలని జస్టిస్ భీమాపాక నగేష్ చెప్పుకొచ్చారు. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.

## కోల్‌కతా మెట్రో ప్రాజెక్టు క్రెడిట్ నాదే..

### మోదీ కార్యక్రమానికి మమత దూరం



కోల్‌కతా: సిటీలోని మూడు మెట్రో మార్గాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం ప్రారంభించే కార్యక్రమానికి దూరంగా ఉండాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిర్ణయం తీసుకున్నారు. రైల్వే మంత్రిగా తాను ఉన్నప్పుడే ఈ మెట్రో రైల్ ప్రాజెక్టులను ప్లాన్ చేసి, మంజూరు చేసినట్టు శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ మమతా బెనర్జీ చెప్పారు. రూ.5,200 కోట్ల విలువైన మూడు కీలక మెట్రో మార్గాలతో సహా మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రధాని కోల్‌కతా పర్యటనలో ప్రారంభిస్తున్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో వలస వచ్చిన బిహారీలను వేధిస్తున్నారని మమత ఆరోపిస్తూ ఈ కార్యక్రమానికి హాజరుకారాదని నిర్ణయం తీసుకున్నారు. మమతా బెనర్జీ కేంద్ర రైల్వే మంత్రిగా రెండు సార్లు పనిచేశారు. మొదటిసారి అటల్ బిహారీ వాజ్‌పేయి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వంలో 1999 నుంచి 2001 వరకూ పనిచేశారు. రెండోసారి కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ-2 ప్రభుత్వంలో 2009 నుంచి 2011 వరకూ పనిచేశారు. రెండోసారి తాను రైల్వే మంత్రిగా ఉన్నప్పుడే కోల్‌కతాలోని మెట్రో విస్తరణ ప్రాజెక్టుల సిరీస్‌ను తాను మంజూరు చేశానని మమతా బెనర్జీ తెలిపారు.'ఆనాటి విషయాలను ఈరోజు చెప్పాలనుకుంటున్నాను. రైల్వే మంత్రిగా నేను ఉన్నప్పుడు మెట్రోపాలిటన్ కోల్‌కతాలో పలు మెట్రో రైల్వే కారిడార్లకు ప్లాన్ చేసి, మంజూరు చేశాను. బ్లూప్రింట్ల తయారీ, నిధులు సమకూర్చడంతో పనులను ప్రారంభించాం. సిటీలోని వివిధ ప్రాంతాల్లో పనులు చేపట్టి, ఇంట్రా సిటీ మెట్రోగ్రిడ్‌కు అనుసంధానించాం. ఆ తర్వాత పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా ఈ ప్రాజెక్టుల అమలులో పాలుపంచుకున్నాను' అని మమతా బెనర్జీ తెలిపారు. రాష్ట్రం నుంచి ఉచితంగా భూములు కేటాయించామని, రోడ్లు వేశామని, నిర్వాసితులకు పునరావాసం కల్పించామని, అన్ని అవరోధాలను తొలగించామని, ప్రాజెక్టుల అమలుకు అన్నిరకాలుగా సహకరించామని సీఎం చెప్పారు. ఎగ్జిక్యూషన్ ఏజెన్సీలతో సమన్వయం సమావేశాలను చీఫ్ సెక్రటరీలు విజయవంతంగా నిర్వహించారని చెప్పారు. మెట్రో మౌలిక వసతుల విస్తరణలో రైల్వే మంత్రిగా, సీఎంగా సుదీర్ఘ ప్రయాణం సాగించినట్టు వివరించారు

# సంపాదకీయం

## సీఈసీపై అభిశంసన...

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడానికి ఆయనపై అభిశంసన తీర్మానం తీసుకువచ్చే అంశాన్ని 'ఇండియా' కూటమి పరిశీలిస్తోంది. ఎన్నికల కమిషనర్‌పై అభిశంసన తీర్మానం తీసుకురావడానికి ప్రతిపక్షాలు సన్నాహాలు ప్రారంభించాయని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు.ఎన్నికల కమిషన్ 'ఓట్ల చోరీ' చేస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆగస్టు 7న ఆరోపించారు.అయితే, రాహుల్ గాంధీ ఆరోపణలు నిరాధారమైనవని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈనెల 17న జరిగిన విలేఖరుల సమావేశంలో స్పష్టంచేశారు. సీఈసీ మీడియా సమావేశం తర్వాత, సోమవారం ప్రతిపక్ష పార్టీల ఎంపీల సమావేశం జరిగింది."ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర పార్టీలు లేవనెత్తిన ప్రశ్నలకు మీడియా సమావేశంలో సీఈసీ సమాధానం ఇవ్వలేదు. బదులుగా, ప్రశ్నలు లేవనెత్తినందుకు ప్రతిపక్షాలను ఆయన ఎగతాళి చేశారు. రాజకీయాల్లో పాల్గొనడం సీఈసీ పనా?" అని వేణుగోపాల్ ప్రశ్నించారు.సీఈసీపై అభిశంసన తీర్మానం తీసుకురావడానికి ప్రతిపక్షాలకు తగినంత సంఖ్యాబలం ఉందని వేణుగోపాల్ అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన చట్ట నిబంధనలను కూడా ఆయన ప్రశ్నించారు.ఇంతకీ, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఆ పదవిలో నియమించడం, తొలగించే విధానం ఏంటి?దేశంలో స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడం ఎలక్షన్ కమిషన్ బాధ్యత. దీని అధికారులను అంటే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్లను భారత రాష్ట్రపతి నియమిస్తారు.దీని కోసం, ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ సిఫార్సులు చేస్తుంది. ఈ కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు లేదా లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నాయకుడు, కేంద్ర మంత్రి మండలి సభ్యుడు ఉంటారు.కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలోని సెర్చ్ కమిటీ ఎంపిక కమిటీకి అభ్యర్థుల పేర్లను ప్రతిపాదిస్తుంది.ఎన్నికల కమిషనర్ నియామకం, వారి పదవీకాలం, తొలగింపు ప్రక్రియ రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్(అపాయింట్మెంట్స్, కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టెన్యూర్) యాక్ట్, 2023' నిబంధనల ప్రకారం జరుగుతాయి.ఈ చట్టం ప్రకారం, ఈ పదవులకు ఎంపికైన వారు గతంలో ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయి పదవుల్లో పనిచేసి ఉండాలి. ఎన్నికల నిర్వహణలో కూడా అనుభవం ఉండాలి.సదరు అధికారిని ఆరు సంవత్సరాల పదవీకాలం లేదా 65 సంవత్సరాల వయస్సు వరకు (ఏది ముందు అయితే అది) నియమిస్తారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఇచ్చే సౌకర్యాలు, ప్రయోజనాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ పొందుతారు.ఈ ఏడాది ఫిబ్రవరిలో జ్ఞానేష్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. ఎన్నికల సంఘం సభ్యుల నియామకం కోసం రూపొందించిన కొత్త చట్టం ప్రకారం బాధ్యతలు స్వీకరించిన మొదటి సీఈసీ ఆయనే.2023 చట్టం రాకముందు, ఎన్నికల కమిషనర్ల నియామకం 1991 ఎలక్షన్ కమిషన్ (సర్వీస్ కండీషన్స్ అండ్ కండక్ట్ ఆఫ్ బిజినెస్ ఆఫ్ ఎలక్షన్ కమిషనర్స్)యాక్ట్ ప్రకారం జరిగేది. కానీ ఈ చట్టంలో ఎంపిక ప్రక్రియను నిర్వచించలేదు.ఫలితంగా, ప్రధానమంత్రి, మంత్రి మండలి సలహా మేరకు రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్లను నియమించేవారు.ఎన్నికల కమిషనర్ల సంఖ్యను ఎప్పటికప్పుడు నిర్ణయించే అధికారం రాష్ట్రపతికి ఉండేది. పాత చట్టం ప్రకారం, ఎన్నికల కమిషనర్ల జీతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానంగా ఉండేది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను "సుప్రీంకోర్టు న్యాయమూర్తి మాదిరిగానే, అదే కారణాలతో" పదవి నుంచి తొలగించవచ్చు. 2023 చట్టంలోని సెక్షన్ 11(2) కింద ఇలాంటి నిబంధన ఉంది.ఆర్టికల్ ప్రకారం, "ప్రధాన ఎన్నికల కమిషనర్ సిఫార్సుపై తప్ప మరే ఇతర ఎన్నికల కమిషనర్ లేదా ప్రాంతీయ కమిషనర్‌ను పదవి నుంచి తొలగించకూడదు"రాజకీయ ఒత్తిడి నుంచి ఎన్నికల కమిషన్‌ను రక్షించడానికి, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించే ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా చాలా కష్టతరం చేశారు. 2023లో సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సమీక్షించింది, ఎన్నికల కమిషనర్లను తొలగించే ప్రక్రియను మార్చడానికి రాజ్యాంగ సవరణ అవసరమని పేర్కొంది.సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానాన్ని నిర్దేశించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (4) ప్రకారం, "దుష్ప్రవర్తన లేదా అసమర్థత నిరూపితమైతే" మాత్రమే సీఈసీని తొలగించడానికి చర్య తీసుకోవచ్చు.దుష్ప్రవర్తనలో అవినీతి పద్ధతులు లేదా పదవీ దుర్వినియోగం ఉండవచ్చు. ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవికి తగని చర్యలు లేదా అధికారిక విధులను నిర్వర్తించడంలో స్పష్టమైన వైఫల్యాలు కూడా ఇందులో ఉన్నాయని కాలానుగుణంగా కోర్టులు పేర్కొన్నాయి.ప్రధాన ఎన్నికల కమిషనర్ తొలగింపు ప్రక్రియను ప్రారంభించడానికి, పార్లమెంటు ఉభయ సభల సభ్యులు దుష్ప్రవర్తన లేదా అసమర్థతను స్పష్టంగా ఆరోపించే తీర్మానాన్ని ప్రవేశపెట్టాలి. ప్రతిపాదన ఆమోదం పొందిన తర్వాత, ఆరోపణల చెల్లుబాటును తనిఖీ చేస్తారు. దీని కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తారు.సీఈసీని తన పదవి నుంచి తొలగించడానికి, పార్లమెంటు ఉభయ సభలలో మూడింట రెండు వంతుల మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదించాలి. ఆ తర్వాత, తొలగింపు ఉత్తర్వుకు రాష్ట్రపతి తుది ఆమోదం ఇవ్వాలి.ఆగస్టు 7న జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో భారత ఎన్నికల సంఘంపై ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు.బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి 'ఓట్ల చోరీ'కి పనిచేస్తున్నాయని, 'బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఓట్లను దొంగిలించే ప్రయత్నం' అని రాహుల్ గాంధీ ఆరోపించారు.హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చిన తర్వాత ఈ సందేహాలు మరింత బలపడ్డాయని ఆయన చెప్పారు.

# అకాల వర్షాలతో దెబ్బతిన్న చేనేత వస్త్ర పరిశ్రమలను – వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి: వైసీపీనేతలు డిమాండ్





ఎమ్మిగనూరు, ఆగస్టు, 22( శ్రీ చక్ర):-ఎమ్మిగనూరు పట్టణంలోని అకాల వర్షాలు వల్ల చేనేత కుటుంబాల జీవితాలను పూర్తిగా దెబ్బతీశాయని తెలిపారు.మగ్గాలు ఏర్పాటు చేసిన గుంతలలో వర్షపు నీరు చేరడంతో నేసే పనులు పూర్తిగా ఆగిపోయాయన్నారు. ఇళ్లలోకి వర్షపు నీరు చేరి మగ్గాలు దెబ్బతిన్నాయని,ముడి సరుకులు నీట మునిగిపోవడంతో చేనేతలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొన్నారు. నిత్యం మగ్గం నేస్తే గాని పొట్ట నిండని పరిస్థితిలో ఉన్న ఈ కుటుంబాలు ఇప్పుడు మగ్గమే వేయలేని స్థితిలో పడిపోయాయని తెలిపారు. ఈ సమస్యలను గమనించిన ఎమ్మిగనూరు నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బుట్టా రేణుక ఆదేశాల మేరకు, వైసీపీ జిల్లా చేనేత అధ్యక్షులు యం.కె.శివ,మునిసిపల్ వైస్ చైర్మన్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు డి.నజీర్ అహమ్మద్,5వ వార్డులోని చేనేతల ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారు. వారు బాధిత చేనేత కుటుంబాలను ప్రత్యక్షంగా కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల మగ్గాలు దెబ్బతిన్న దృశ్యాలను పరిశీలించి తక్షణ సాయం అవసరమని గుర్తించారు.చేనేత కుటుంబాలు నేతలతో మాట్లాడుతూ గత వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయములో తమకు లభించిన సాయాన్ని గుర్తు చేసుకున్నారు. "నేతన్న నేస్తం పథకం ద్వారా సంవత్సరానికి రూ.24,000/- మాకు అందేది. 100 యూనిట్ల ఉచిత కరెంట్ లభించేది. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి పథకం మా ఇంటి వద్దకే చేరేది. అర్హత కలిగిన ప్రతి చేనేత కుటుంబం నష్టపోకుండా ప్రభుత్వం పథకాలను అందించేదన్నారు.ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో ప్రతి కుటుంబానికి వాలంటీర్ల ద్వారానే అవసరమైన సరుకులు ఇంటికి చేరాయి. ఆ సమయంలో ఎంత కష్టమైనా ప్రభుత్వం అండగా నిలిచింది" అని వారు వివరించారు.కానీ ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయిందని వారు వాపోయారు. "ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చడం లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన పథకాలలో ఒక్క పథకం కూడా మాకు అందడం లేదని వాపోయారు. చేనేతల సమస్యలను పరిష్కరించేందుకు ఎవరూ కూడా ముందుకు రావడం లేదని తెలిపారు. స్థానిక కౌన్సిలర్లు, అధికారులు, కూటమి నేతలు ఎవరూ కనీసం మా ఇళ్లకు వచ్చి సమస్యలు అడగలేదు. ఇప్పుడు మా సమస్యలు వినేవారు, పరిష్కరించే వారు కరువయ్యారు అని చేనేతలు ఆవేదన వ్యక్తం చేశారు.వైసీపీ నేతలు ఈ సందర్భంలో మాట్లాడుతూ, మీరు ఎదుర్కొంటున్న నష్టాన్ని నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టా రేణుక దృష్టికి వెంటనే తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం మీ సమస్యల పట్ల స్పందించేలా కలిసి పోరాడుదాం అని తెలిపారు. తగిన నష్టపరిహారం అందించేందుకు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు.చేనేతల సమస్యల పరిష్కారం కోసం వైసీపీ ఎల్లప్పుడూ మీకు అండగా నిలుస్తుంది అని భరోసా ఇచ్చారు.వైసీపీ నేతలు గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వ తేడాను కూడా స్పష్టంగా చేనేతలతో చర్చించారు. వైసీపీ ప్రభుత్వం చేనేతలను రక్షించేందుకు ఎన్నో పథకాలను అమలు చేసి, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసిందని, కానీ ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ పథకాలన్నింటినీ నిలిపివేసి, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను మరిచిపోయిందని వారు పేర్కొన్నారు. చేనేతలకు తక్షణమే జరిగిన నష్టాన్ని గుర్తించి ఆదుకోవాలని తెలిపారు. టిడిపి ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే మరింత దుర్భర పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.ఈ పర్యటనలో జిల్లా భూత్ కమిటీ కార్యదర్శి మోనే నారాయణ, 5వ వార్డు నాయకులు బుట్టా బాబు రావ్,పట్టణ వాణిజ్య విభాగ అధ్యక్షులుడ 4వ వార్డు ఇంచార్జ్ కనికే నాగేంద్ర,పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం అంజి,పట్టణ కార్యదర్శి జెరుబండి రఘువీర,2వ వార్డు ఇంచార్జ్ గడిగే చంద్రమోహన్, మీడియాఅధ్యక్షులుఎన్. యండి.షరీఫ్, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొని చేనేత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

# పదే పదే నేరాలకు పాల్పడిన వారిపై "గ్యాంగ్ ఫైల్స్" ఓపెన్ చేయాలి

**కన్విక్షన్ శాతం పెంచాలి**
**గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి**
**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,**

గోదావరిఖని : జులై నెల నేరా సమీక్షలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈరోజు కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసిపి లు, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఎసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్, డివిజన్, జోన్లవారిగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమాచారంతో పాటు, గతం లో జరిగిన తప్పిదాలు, భవిష్యత్తు లో కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందని మొదలైన అంశాలపై పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులతో సమీక్షా జరిపారు. అదేవిదంగా నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించడం జరిగిందిఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .... కేసుల దర్యాప్తులో విషయంలో అధికారులు ప్రస్తుతం అందుబాటులో వున్న టెక్నాలజీతో పాటు, శాస్త్రీయ పద్దతిను కూడా అనుసరిస్తూ దర్యాప్తు చేపట్టాలి. గతం లో నమోదైన పెండింగ్ లో వున్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రధానంగా మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి కేసుల్లో దర్యాప్తు పారదర్శకంగా నిర్వహించి వేగవంతం చేయడంతో పాటు, నిందితులకు కోర్టులో శిక్షలు పడేవిధంగా తగు సాక్ష్యాధారాలను కోర్టుకు అందజేయాల్సిందిగా అలాగే మహిళలు, బాలికల మిస్సింగ్ కేసుల్లో అధికారులు వేగం స్పందించాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ఫోర్స్మెంట్ వర్క్ చేస్తే నేరాల నియంత్రణ, ప్రజల తో మంచి సత్సంబంధాలు పెరుగుతాయి. ప్రాపర్టీ కేసులలో రికవరీ శాతం పెరగాలి. ఎవరైతే మరల మరల దొంగతనాలకు పాల్పడడం, నకిలీ విత్తనాలు అక్రమ రవాణా, సరఫరా, రాబరీ, డెకైట్, గంజాయి ఇతర నేరాలకు పాల్పడిన వారిపై "గ్యాంగ్ ఫైల్స్" ఓపెన్ చేయాలి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ విభాగంతో కల్సి పనిచేయాలని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు గల కారణాలపై విశ్లేషణ చేసి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ రూల్స్ ఉల్లాంఘన కాంటాక్ట్, నాన్ కాంటాక్ట్ చాలన్స్ విధించాలని సూచించారు.ప్రస్తుతం సైబర్ క్రైమ్స్ అనేది ఒక పెద్ద సమస్య. సైబర్ క్రైమ్స్ పై శ్రద్ధ పెట్టాలి. ప్రజలు అవగాహన పరుస్తూ పోలీస్ అధికారులు సైబర్ క్రైమ్స్ పై అవగాహన ఉండి నేరాల నివారణకు, దర్యాప్తు కు సిద్ధంగా ఉండాలి. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని గంజాయి నియంత్రణ కు ప్రత్యేక టీమ్ లు ఏర్పాటు చేయాలి. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా, సేవించడంపై నిఘా, నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిందితులను పట్టుకొని కేసులు నమోదు చేసి జైలు కి పంపాలి. అదేవిదంగా చట్ట విరుద్ధంగా ఎవరు పనిచేసిన ఎవరిని వదిలి పెట్టేది, ఉపేక్షించేది లేదు అని హెచ్చరించారు.వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికరులను ఆదేశించారు. విగ్రహాల ప్రతిష్టాపన విషయంలో నిర్వాహకులతో ముందుగానే సమావేశాలు ఏర్పాటు చేయాలని, ఎక్కడా శాంతిభద్రతల సమస్య తలెత్తనివ్వొద్దన్నారు.

మండపాల్లో డీజే ఏర్పాటుకు అనుమతి లేదని, ప్రతి మండప నిర్వాహకుల వివరాలు తీసుకోవాలన్నారు. మండపం వద్ద తప్పనిసరిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలని, కీలక ప్రదేశాల్లో పికెట్లు ఏర్పాట్లు చేయాలన్నారు . విగ్రహం ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు నిర్వాహకులదే బాధ్యత అని, నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లపై సంబందిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టినా, ఇతరులకు పంపించినా క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కమిషనరేట్ పోలీసు కార్యాలయంలో సోషల్ మీడియా సెల్, కంట్రోల్ రూమ్ ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని నిరంతరం సామాజిక మాధ్యమ పోస్టులను పరిశీలిస్తామని సీపీ తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2025 సంవత్సరం లో ఇప్పటి వరకు గంజాయి నియంత్రణ, నిర్మూలనలో భాగంగా గంజాయి అక్రమ రవాణా, సరఫరా ప్రత్యేక నిఘా, ఇన్ఫర్మేషన్ వ్యవస్థ ఏర్పాటు చేసుకొని గంజాయి నియంత్రణ చేస్తూ పెద్దపల్లి జోన్ పరిధిలో 34 కేసులలో 98 మందిని అరెస్ట్ చేయడం జరిగింది.

# ఎన్.డి.ఏ. ప్రభుత్వం తొలగించిన అర్హులైన విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లు వెంటనే పునరుద్ధరించాలి...

**సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్.**

బ్రహ్మం గారి మఠం ,మండలం కేంద్రమైన బ్రహ్మంగారి మఠంలోని, సిపిఎం మండల కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ , బ్రహ్మంగారిమఠం మండల సిపిఎం కార్యదర్శి జి.సునీల్ కుమార్ సంయుక్తంగా శుక్రవారం ఉదయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని టీడీపీ,జనసేన,బిజెపి సంకీర్ణ ఎన్డీఏ ప్రభుత్వం అర్హులైన, విభిన్న ప్రతిభావంతులైన వికలాంగుల పెన్షన్లు తగ్గించాలని వివిధ జిల్లాల అధికారులకు ఆదేశాలు ఇవ్వడం ప్రజావిరుద్ధ చర్య అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల, శ్రామికులు మరియు అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పని చేస్తామని ఒకవైపు నమ్మ పలుకుతూ వాస్తవంగా ఆచరణలో సంపన్నులు మరియు కార్పొరేట్ల, ఇండస్ట్రీల అధిపతుల ప్రయోజనాల కోసం క్విట్ ప్రోకో అంతర్గత పాలసీని అమలు చేస్తోందని విమర్శించారు. వికలాంగుల పెన్షన్లకు కోత విధించడం క్రూరమైన చర్య అని దానిని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లు ఎవరి దయాదాక్షిన్యాలతో వచ్చినవి కావని, పోరాటాల, ఉద్యమల కృషితో విభిన్న ప్రతిభావంతులైన వికలాంగులు సంపాదించుకున్న కనీస హక్కులు అని తెలిపారు. ఈ హక్కులు ప్రజా ఉద్యమాలు, ప్రజాస్వామ్య పోరాటాల ఫలితంగా అందబడ్డాయి అని గుర్తు చేశారు. పెన్షన్లను తగ్గించడం ద్వారా ప్రభుత్వం వికలాంగుల్లో అత్యధికమైన అణగారిన వర్గాలపై, నేరుగా దాడి చేస్తోందని ఆరోపించింది. ఇది వారిని ఇంకా అధిక పేదరికంలోకి నెట్టడం, చిన్న చూపు చూపడమని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం "సామాజిక న్యాయం", "అవసరమైన వారికి మద్దతు" అనే మాటలతో వచ్చిందని, ఒకటిన్నర ఏడాది పూర్తి కాకముందే ప్రభుత్వం నిజమైన ప్రజా వ్యతిరేక ఎజెండా బయటపడిందని విమర్శించారు. పేదల సబ్సిడీలను తగ్గిస్తూ, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ లాబీలు, కార్పొరేట్ మిత్రులకు రాయితీలు అందించడం. పన్నుల మినహాయింపులు, పెద్ద పారిశ్రామికవేత్తలకు ఉచిత సదుపాయాలు ఇవ్వడం "ఆర్థిక నియంత్రణ" పేరిట పేదలపై చేస్తున్న కుట్రపూరిత దాడిగా పేర్కొన్నారు. ఇది కేవలం సంక్షేమ సమస్య కాదని, పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు వేసి పన్నుల రూపంలో తీసుకుని, ధనవంతులకు ఇవ్వాలన్న నెయోలిబరల్ పాలసీలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పిల్లల చదువు, వైద్యం ఖర్చులు తీవ్రంగా ప్రతి పేద మధ్యతరగతి కుటుంబాలలో పెరిగిపోవడంతో, కార్మికులు, రైతులు, మహిళలు, యువత ఇప్పుడు నలిగిపోతున్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణమే పెన్షన్లను బేశరత్తుగా పునరుద్ధరించాలి, పెంచిన పర్సంటేజీ వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పేద, దిగువ మధ్యతరగతి అన్ని వర్గాలకు న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు.విభిన్న ప్రతిభావంతులైన వికలాంగుల హక్కుల కోసం పోరాడుతున్న సంస్థలతో కలిసి సిపిఎం పోరాటం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కొలువుతీరి ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలోని ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బుడ్డెనబోయిన అజయ్, లక్ష్మీనారాయణ లు పాల్గొన్నారు

# టేకులపల్లిలో రూ.2 కోట్లకు పైగా విలువైన గంజాయి పట్టివేత




టేకులపల్లి, ఆగస్టు 22 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని వెంకట్యాతండా సమీపంలో పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. కేసు వివరాలను ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను శుక్రవారం వెల్లడించారు. గురువారం సాయంత్రం వెంకట్యాతండా సమీపంలో సీసీఎస్, టేకులపల్లి పోలీసులు సంయుక్తంగా వావాన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన లారీ చెక్ చేయగా అందులో 424.950 కేజీల గంజాయి లభించింది. దీని విలువ రూ.2 కోట్ల 12 లక్షల 47 వేలుగా తెలిపారు. నిందితులు గంజాయిని కొనుగోలు చేసి ఒడిశా నుంచి భద్రాచలం, పాల్వంచ మీదుగా రాజస్థాన్ తరలిస్తున్నట్లుగా సమాచారం.నిందితుల్లో ప్రభులాల్ గుర్జర్, శివరాజ్ గుర్జర్ పట్టుబడ్డారు. రాంబాబు, నారాయణ గుర్జర్ పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి ఎస్ఐ రాజేందర్, బోడ్ ఎస్ఐ శ్రీకాంత్, సీసీఎస్ సిబ్బంది, సీఐ రమాకాంత్, ఎస్సీ ప్రవీణ్ పాల్గొన్నారు.

# నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం 500/200 యూనిట్ల పట్ల హర్షం

**ప్రభుత్వంకు కృతజ్ఞతగా ఎమ్మెల్యే ను ఘనంగా సత్కరించిన నేత కుటుంబం**



వరదయ్యపాలెం,ఆగస్టు 22(శ్రీచక్ర):నేతన్నల కోసం ప్రభుత్వం తీసుకున్న ఉచిత విద్యుత్ నిర్ణయం పట్ల నేతన్నలు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా స్థానిక ఇందిరానగర్ పంచాయతీ లోని త్యాగరాజు పవర్ లూం యూనిట్ ను ఎమ్మెల్యే సందర్శించారు.పవర్ లూం నేతన్న కుటుంబం (గుత్తి మల్లిక-గుత్తి సురేష్ బాబు దంపతులు)తో ఎమ్మెల్యే కోనేటి అదిమూలం స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలు,వృత్తి లో అనుభవాలు తెలుసుకుని,ముడి సరకులను,ఉత్పత్తిని పరిశీలించారు.ప్రధానమంత్రి రోజ్ గర్ యోజన(పిఎంఆర్వై)పథకం ద్వారా,స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారం తో 1997 లో చిన్న తరహా పరిశ్రమ(స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్)త్యాగరాజు పవర్ లూం యూనిట్ ను ప్రారంభించామని, మా కుటుంబం అంతా నేత వృత్తి పై ఆధారపడి జీవిస్తున్నామని ఎమ్మెల్యే తో అన్నారు.పవర్ లూం కు 500 యూనిట్లు, చేనేత కు 200 యూనిట్ల ఉచిత విధ్యుత్ పైప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతించిన నేతన్నలు,ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేసి, శుభానికి చిహ్నం అయిన పసుపు-పచ్చవర్ణ నేత వస్త్రంతో ఎమ్మెల్యే ను ఘనంగా సత్కరించారు.చేనేత కు 25000/- ప్రకటించిన ప్రభుత్వం,నేతన్నల సంక్షేమం కోసం ఇలాంటివి మరిన్ని పథకాలు అమలు చేస్తే తమ జీవితాలు మరింత వెలుగులోకి వస్తాయని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొందు భారతి,పవర్ లూం పొన్నేరి గోపి,నూతలపాటి శ్రీనివాసులు నాయుడు,భవన నిర్మాణం కార్మిక నాయకుడు కోటి,యునఫ్ ఆలీ,తెలుగు మహిళ మునిభూషణమ్మ,నీలమ్మ,జయశంకర్ రెడ్డి,వేణు,పుట్టయ్య,బాలరాజు, సుబ్బుయాదవ్,నందకిశోర్,తదితరులు పాల్గొన్నారు.


# రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పర్యటన విజయవంతం చేయాలి: నియోజకవర్గ ఇన్చార్జి రామకృష్ణారెడ్డి



రామచంద్రపురం, ఆగస్టు 22( శ్రీచక్ర)ఈనెల 25న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరగనున్న రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎంఎన్ మాధవన్ పర్యటన విజయవంతం చేయాలని రామచంద్రపురం నియోజకవర్గ ఇన్చార్జి రామకృష్ణారెడ్డి ఆపార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు .ఈమేరకు శుక్రవారం భారతీయ జనతా పార్టీ,రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామంలో సారథ్యం కార్యక్రమానికి కార్యకర్తల సమీకరణ కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సారథ్యం కార్యక్రమం రామచంద్రపురం నియోజకవర్గం ఇంచార్జ్ తమలంపూడి రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవన్ అమలాపురం రానున్న సందర్భంలో రామచంద్రపురం నియోజకవర్గ నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలని తరలించే దిశగా అందరూ ప్రయత్నం చేయాలని ముఖ్య అతిథి రామకృష్ణారెడ్డి అన్నారు.ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించామని, నాలుగు మండలాల నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించేలాగా ప్రతి పోలింగ్ బూత్ కి వెళ్లి వివరాలు సేకరిస్తుమని మండల అధ్యక్షులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు ,ద్రాక్షారామ మండల అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ, కే గంగవరం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి చంద్రరావు, రామచంద్రపురం టౌన్ అధ్యక్షుడు దునే శ్రీనివాసరావు, రామచంద్రపురం టౌన్ ప్రధాన కార్యదర్శి మాధవ పట్ల కృష్ణమూర్తి, బిజెపి సీనియర్ నాయకులు అవసరాల వెంకటరమణమూర్తి, ఓబిసి జిల్లా కార్యవర్గ సభ్యులు ఇందన వీర వెంకట సత్యనారాయణ తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


# రీ-సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ కే.జే జే రావు

కోట ఆగస్థు 22 (శ్రీ చక్ర): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ సర్వేతో గ్రామాలలో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని కోట తహసీల్దార్ కటారి జయ జయ రావు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని మద్దలి, కేశవరం, చిట్టేడు గ్రామాల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెట్టమెదటి సారిగా చేపడుతున్న భూ సర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కటారి జయ జయ రావు మాట్లాడుతూ రెవెన్యూలో రైతులకు పలు సమస్యలు ఉంటాయనే నేపథ్యంలో వాటి పరిష్కారానికి ఈ భూ సర్వే ఎంతో ఉపయెగ పడతుందన్నారు.రైతులందరు సర్వే టీంలు కొలతలు వేసే రోజు పొలాలకు వెళ్లి తమ వద్ద ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు,లింక్ డ్యాక్‌మెంట్లు,రిజిస్ట్రేషన్ స్లాంపులు అధికారులకు చూపించాలన్నారు.ఎన్నో ఏళ్ల నుంచి భూ సర్వే లేక రైతుల భూములు రికార్డులో నమోదు కాక పోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు.వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరిత గతిన సర్వే పూర్తి చేయిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కటారి జయ జయ రావు, ఆర్ ఐ ప్రసాద్,మండల సర్వేయర్ గోపిరెడ్డి, వి ఆర్ ఓ పోలయ్య,రెవెన్యూ సిబ్బంది, స్థానిక గ్రామ రైతులు పాల్గొన్నారు.



# ఏపీ సీడ్స్ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

**ఏపీఎస్డీసీఎల్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి**





అమరావతి, ఆగస్టు 22(శ్రీచక్ర): విజయవాడ ప్రసాదంపాడు లోని ఏపి సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ హెడ్ ఆఫీస్ నందు శుక్రవారం ఏర్పాటు చేసిన 223వ బోర్డ్ మీటింగ్ కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, ఎస్.ఢిల్లిరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో అజెండా లోని పలు అంశాలపై చర్చించుకోవడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ కమతం కాటమయ్య , రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ జగదీశ్వరి, జలంధర్ ఓఎస్డీ (ప్రాడ్ ,మార్కెడ క్యూసీ ), బోర్డ్ మెంబర్ సురేంద్ర, బోర్డ్ మెంబర్ మోహన్ , బోర్డ్ మెంబర్ పట్నాయక్ , బోర్డ్ మెంబర్ గజనంద్ సింగ్ మరియు తదితరులు పాల్గొన్నారు. ×అజెండా లోని అంశాలు×25.06.2025న జరిగిన డైరెక్టర్ల బోర్డు 222వ సమావేశం యొక్క మినిట్స్ ధృవీకరించడానికి×25.06.2025న జరిగిన డైరెక్టర్ల బోర్డు 222వ సమావేశం యొక్క ఓతినిబీబివబ పై తీసుకున్న చర్యను సమీక్షించడానికి. రాజ్మా రెడ్ (స్థానిక), హార్స్‌గ్రామ్ మరియు కౌపీ (ఎరుపు) ౧/ఒ విత్తనాల సేకరణ కోసం 18.07.2025న జరిగిన టెండర్ కమిటీ సమావేశం యొక్క మినిట్స్ ధృవీకరించడానికి. 2024-25 రబీ సీజన్‌లో పంపిణీ చేయబడిన వివిధ పంట విత్తనాల పరిమాణంపై అంచనా. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అ ఢ ంఉ వ్యాఖ్యలతో పాటు ఆడిట్ చేయబడిన ఆర్థిక నివేదికలను పరిగణనలోకి తీసుకోవడం.×మార్చి 31, 2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ముసాయిదా డైరెక్టర్ నివేదికను ఆమోదించడం.2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక నివేదికల ఆమోదం కోసం వాయిదా పడిన 47వ వార్షిక సాధారణ సమావేశం తేదీ, సమయం మరియు స్థలాన్ని నిర్ణయించడం.2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక నివేదికల ఆమోదం కోసం వాయిదా పడిన 47వ వార్షిక సాధారణ సమావేశం యొక్క ముసాయిదా నోటీసును పరిగణనలోకి తీసుకోవడం. 2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాలెన్స్ షీట్, లాభం ఢ నష్ట ప్రకటన మరియు నగదు ప్రవాహ ప్రకటనల వంటి ముసాయిదా ఆర్థిక నివేదికలను సమీక్షించడం మరియు ఆమోదించడం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 48వ వార్షిక సాధారణ సమావేశం యొక్క తేదీ, సమయం మరియు స్థలాన్ని నిర్ణయించడం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 48వ వార్షిక సాధారణ సమావేశం యొక్క ముసాయిదా నోటీసును పరిగణనలోకి తీసుకోవడం మరియు ఆమోదించడం. సెక్రటేరియల్‌ను పరిగణనలోకి తీసుకోవడం మరియు ఆమోదించడం 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆడిట్ నివేదిక.ఏపీఎస్డీసీఎల్ ఈపీఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఇపోఫ్ కి సరెండర్ తేదీ మార్పు కోసం పరిశీలన.

# కుయ్యేరులో మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు

**భారీగా తరలివచ్చిన మహిళ భక్తులు**

**300 మందికి అమ్మవారు డాలర్లు ప్రతిమలు పంపిణీ**





కాజులూరు , ఆగస్టు 22(శ్రీ చక్ర)కుయ్యేరు గ్రామప్రజల ఇలవేల్పు అయిన శ్రీ మహాలక్ష్మి అమ్మ వారికి ఆ గ్రామానికి చెందిన పలువురు ఆడపడుచులు కుంకుమ పూజ, అభిషేకాలు జరిపించి తమ తమ మొక్కలను చెల్లించుకున్నారు. ఈ మేరకు శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా కాజులూరు మండలం కుయ్యేరు గ్రామంలో యానాం- ద్రాక్షారామ ప్రధాన రహదాని ఆనుకుని ఉన్న శ్రీ తాళ్ళమ్మ, శ్రీ మహాలక్ష్మిఅమ్మ శ్రీ గొడ్లమ్మ, తల్లుల ఆలయంలో ఆయా అమ్మవార్లకు కుంకుమ పూజ అభిషేకాలతో పాటు లలితా పారాయణం చేసి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకించి మహిళలు భారీస్థాయిలో తరలి వచ్చి తమ తమ మొక్కలను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఇక్కడికి విచ్చేసిన సుమారు 300 మంది మహిళా భక్తులకు అమ్మవారి డాలర్ తో పాటు మహాలక్ష్మి అమ్మవారి ప్రతిమను ఉచితంగా అందజేశారు. కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలే కాకుండా గ్రామానికి చెందిన పలువురు ఆడపడుచులు వివిధ గ్రామాల నుండి భారీగా తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ శుక్రవారం భారీ ఎత్తున జరుపుకునే ఈకార్యక్రమంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షణ చేసి చూసారు.ఇది ఇలా ఉండగా గతనెలలో ఆషాడ మాసం పురస్కరించుకుని ఇక్కడ మహాలక్ష్మి అమ్మవారికి భారీ ఎత్తున గ్రామానికి చెందిన వందలాది మంది ఆడపడుచులు తరలివచ్చి వారి వారి తహతకు తగ్గట్టుగా అమ్మవారికి ఆషాడం సారి తొలిసారిగా సమర్పించడం గ్రామంలో ఇటీవల ఒక ప్రత్యేకత సంతరించుకోవడం పాఠకులకు విదితమే .


# శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానంలో ...,పసుపులేటి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం





కోట ఆగస్థు 23 (శ్రీ చక్ర): శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా కోటలో వెలసిఉన్న కోటమ్మ తల్లి దేవస్థాన ప్రాంగణంలో శ్రీ ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్,డాక్టర్ దివ్యప్రియ దాతృత్వంతో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా నిర్విరామంగా ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమని,శ్రావణ మాసం చివరి శుక్రవారం పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 300 పైగా భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేసే అదృష్టం కలిగించినందుకు ఆలయ ధర్మకర్త జగన్మోహన్ రెడ్డి దంపతులకు మరియు కార్య నిర్వాహకులు అల్లం రమణయ్య మరియు వారి బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి దాత పసుపులేటి కిషోర్ దంపతులను అభినందిస్తూ వారి కుటుంబ సభ్యులకు కోటమ్మ తల్లి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదించారు.

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం



కోటఆగస్థు23 (శ్రీచక్ర ): కోట మండలం గూడలి గ్రామం దక్షిణం పొలం లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిపారు.వాకాడు మండలం బాలిరెడ్డిపాళెంగ్రామంలోనిశ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకట రామిరెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధు కిరణ్ రెడ్డిల ఆర్థిక సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.తిరుపతి జిల్లా అర్చక సలహా మండలి సభ్యులు దీవి అనంతాచార్యులు శ్రీ వైఖానస ఆగమోక్తంగా శ్రీ సీతారాముల శాంతి కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. అరసి నరేష్ శర్మ, కోన సాయిబాబు,నాగేంద్ర స్వాములు పూజాదికాలు నిర్వహించారు. లేబూరు సాయి బృందం నాదస్వర కచేరి,పూనమల్లి సునీల్ కుమార్ అన్నమాచార్య కీర్తనలు భక్తులను అలరించాయి.ఈ కార్యక్రమంలో మండి వెంకటరామిరెడ్డి శివరామమ్మ,చెన్నూరు కోటేశ్వరి,వీర రాఘవరెడ్డి,లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# హైఅలర్ట్.. ఆగస్ట్ 31 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్..!

తెలంగాణలోని ప్రజలకు బిగ్ అలర్ట్.. పేద ప్రజల ఆరోగ్యానికి అండగా నిలిచే 'ఆరోగ్య శ్రీ' సేవలు అతి త్వరలో నిలిచిపోనున్నాయి. ఆగస్ట్ 31 అర్ధరాత్రి నుంచి ప్రైవేట్ ఆసుపత్రులలో ఆరోగ్రశ్రీ సేవలు బంద్ కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఓ ప్రకటన చేసింది. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. మేరకు అధ్యక్షుడు వద్దిరాజు రాకేష్ మాట్లాడుతూ .. బకాయిల చెల్లింపులో జాప్యం, ఆర్థిక భారం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జనవరిలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే రూ.1300-1400 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులు గణనీయంగా పెరగడంతో కొన్ని చిన్న ఆస్పత్రులను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. గత జనవరిలో ప్రభుత్వం 4-5 నెలల్లో బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చిందని.. ఆరు నెలలు గడిచినా అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 471 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయని.. రూ.1300 నుంచి 1400 కోట్ల బకాయిలు ఉన్నట్టు తెలిపింది. బకాయిలు వెంటనే చెల్లింపులు చేయాలని, ఆరోగ్యశ్రీ ప్యాకేజీలలో సవరణ చేయాలని టీఏఎన్‌హెచ్ఏ డిమాండ్ చేస్తోంది. ఆర్థిక భారాన్ని భరించలేక వైద్యులకు జీతాలు కూడా ఇవ్వలేకపోతున్నామని అంటున్నారు. ఆరోగ్యశ్రీతో పాటు జర్నలిస్టులు, ఉద్యోగుల హెల్త్ స్కీమ్స్ కూడా నిలిచిపోనున్నాయని తెలుస్తోంది.ఇప్పటికే చాలాసార్లు హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది.

# గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చొరవతో...,తిరుపతి జిల్లా రైతు విభాగ కార్య నిర్వాహక కార్యదర్శి,,,పెన్నక్క నీటి సంఘం అధ్యక్షులు నెల్లూరు.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో..,వి.పి అగ్రహారం లో విద్యుత్ సమస్యకు తక్షణమే పరిష్కారం..,

కోట ఆగస్థు 22 (శ్రీ చక్ర): గత కొంత కాలంగా విద్యత్ సమస్యతో బాధపడుతున్న కోట మండలం పరిధిలోని విశ్వనాధపురం అగ్రహారంలో గత కొంతకాలంగా విద్యుత్ సమస్యతో బాధపడుతుండేవారు. ఈ నేపథ్యంలో స్థానిక గ్రామస్తులు విద్యుత్ సమస్యను, గూడూరు ఎమ్మెల్యే పార్సెల్ సునీల్ కుమార్,టిడిపి సీనియర్ నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది.తక్షణమే గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్,నెల్లూరు మోహన్ రెడ్డి స్పందించి సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి 24 గంటల విద్యుత్తు అందించేందుకు విద్యుత్ అధికారులు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు భూమి పూజ నిర్వహించడం జరిగింది. దీంతో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్,నీటి సంఘం అధ్యక్షులు నెల్లూరు మోహన్ రెడ్డి లకు విశ్వనాధపురం అగ్రహారం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# అరుణ చుట్టూ రాజకీయం

నెల్లూరు, ఆగస్టు 22, వైసీపీలో వైభోగం అనుభవించింది, కూటమి వచ్చాక పాత పరిచయాలతో రెచ్చిపోయింది. చివరకు జైలుకెళ్లింది. సింపుల్ గా ఇదీ అరుణ స్టోరీ. ఆమె జైలుకెళ్లడంపై రెండు పార్టీల నేతలు తీవ్ర వాదోపవాదాలు చేసుకుంటున్నారు. ఆమె వైసీపీ అంటే కాదు, టీడీపీ అంటున్నారు. మీ పార్టీ ఆమెను పెంచి పోషించిందంటే, మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఆటలు సాగాయంటూ ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారు. ఆమెకు సహకరించిన నేతలు మాత్రం తేలుకుట్టిన దొంగల్లా సైలెంట్ అయ్యారు. నిడిగుండ అరుణ సోషల్ మీడియా అకౌంట్లు చూస్తే మాత్రం ఆమె ఏ పార్టీనో, ఏ పార్టీకి మద్దతిస్తారో, ఏయే అధికారులతో ఫొటోలు దిగారనేది స్పష్టంగా తెలిసిపోతుంది. వైసీపీ హయాంలో వైభోగం.. నిడిగుండ అరుణ అలియాశ్ దిశ అరుణ.. వైసీపీ హయాంలో ఆమె తనను తాను దిశ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధ్యక్షురాలిగా చెప్పుకునేది. అందుకే ఆమె దిశ అరుణ అయ్యారు. దిశ అరుణగా రాజకీయ నాయకులతో కలసి మెలసి తిరిగేది, వారి బర్త్ డే వేడుకలకు హాజరై కేక్ తినిపించేది. ఆ వీడియోలు, ఫొటోలన్నీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. వైసీపీ ఆఫీస్ లో ఆమె పెట్టిన ప్రెస్ మీట్ వీడియోలు కూడా ఇప్పుడు వైరల్ గా మారాయి. వైసీపీ పార్టీ నేతగా అరుణ ప్రచారం చేసుకున్నారని, ఆ పార్టీ నేతలు కూడా ఆమెకు సహకరించారని టీడీపీ వెటకారం చేస్తోంది. అయితే ఇక్కడ వైసీపీకి తప్పించుకునే అవకాశం కూడా లేదు. ఫొటోలు, వీడియోలు, అన్నీ పగడ్బందీగా ఉండటంతో సోషల్ మీడియా దెబ్బకి వైసీపీ తేలు కుట్టిన దొంగలా మారింది. టీడీపీ సంగతేంటి..? వైసీపీ హయాంలో ఆమె తప్పులు చేసింది సరే, మరి కూటమి వచ్చాక అయినా ఆ తప్పులకు లెక్కలు చెప్పాలి కదా. కానీ ఇప్పుడు కూడా అదే జరిగింది. వాస్తవానికి అరుణ ప్రియుడు శ్రీకాంత్ పెరోల్ పై విడుదల కావడం మరింత సంచలనంగా మారింది. మీడియా హడావిడి వల్ల అసలు విషయం బయటకు పొక్కడంతో ప్రభుత్వం నష్టనివారణ చర్యలు తీసుకుంది. శ్రీకాంత్ పెరోల్ రద్దయింది, బెదిరింపుల కేసులో అరుణ అరెస్టై జైలుకెళ్లింది. అయితే ఈ పెరోల్ కోసం టీడీపీ ఎమ్మెల్యేలు కొందరు కృషి చేశారనే ఆరోపణలు పార్టీని ఇబ్బంది పెట్టాయి. తనకే సంబంధం లేదని, తన నియోజకవర్గానికి చెందిన వారు వస్తే పెరోల్ కోసం సిఫారసు చేశానని, అయినా తన లేఖ వల్ల పెరోల్ రాలేదంటూ గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రెస్ మీట్ పెట్టి మరీ వివరణ ఇచ్చారు. మరికొందరు నేతల పేర్లు వినపడుతున్నా వారు బయటకు రావడానికి జంకుతున్నారు. అంతా ఆ ఫోన్లలోనే.. అరెస్ట్ సమయంలో నిడిగుండ అరుణ నుంచి పోలీసులు రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్లలో అసలు వ్యవహారం అంతా ఉందని తెలుస్తోంది. పోలీస్ అధికారుల వ్యవహారాలు కూడా అందులో ఉన్నాయట. అదే సమయంలో రాజకీయ నాయకులతో ఆమె దిగిన ఫొటోలు, ఆడియో కాల్స్ రికార్డింగ్ లు కూడా ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఇందులో నిజం ఎంతున్నా.. అందులోనీ సమాచారం అంతా బయటకు వస్తుందని ఆశించలేం. ఈ విషయంలో తలాపాపం తిలా పిడికెడు అన్నట్టుగా ఉంది వ్యవహారం. ఆమె బాధితులు అన్ని పార్టీల్లోనూ, చివరకు ప్రభుత్వ విభాగాల్లో కూడా ఉండటం విశేషం. సో అందరూ దొంగలే కాబట్టి, అందరూ సైలెంట్ గానే ఉన్నారు. ఈ వ్యవహారంలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం మినహా ఇంకో అడుగు ముందుకు వేయడం లేదు.

# పాపం...కమ్మ నేతలు

విజయవాడ, ఆగస్టు 22, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తుంది. అయితే ప్రస్తుత మంత్రి వర్గంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తిగా ఉన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో కొందరు నేతలు విస్తరణపై ఆశలు పెట్టుకున్నారు. సీనియర్ నేతలతో పాటు గుంటూరు, కృష్ణా జిల్లాకు చెందిన కమ్మ సామాజికవర్గం నేతలు కూడా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ రెండు జిల్లాలకు చెందిన కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలకు కేబినెట్ లో ఐదేళ్లు అవకాశం దక్కే ఛాన్స్ లేదంటున్నారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు కావడమే మంత్రి వపదవి దక్కకపోవడానికి ప్రధాన కారణంగా చెప్పాలి.. ఇప్పటికే చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఐదు గురు కమ్మ సామజికవర్గం నేతలు ఉండటమే అందుకు కారణం. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మంత్రులుగా నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్ లు కేబినెట్ లో ఉన్నారు. ఇందులో నలుగురు టీడీపీకి చెందిన వారు కాగా, ఒక్కరు జనసేనకు చెందిన వారు.ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ జరిగినా చంద్రబాబును తప్పిస్తే మిగిలిన నలుగురిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశాలు లేవనే చెప్పాలి. ఎందుకంటే వీరు యాక్టివ్ గా ఉండటంతో పాటు ప్రాంతాల వారీగా పట్టున్న నేతలు. రాయలసీమలో పయ్యావుల కేశవ్, గుంటూరు జిల్లాలో నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్, ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్ లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నలుగురిని తప్పించే అవకాశం లేకపోవడంతో గుంటూరు జిల్లా కమ్మ సామాజికవర్గం ఎమ్మెల్యేలు ఇక మంత్రి పదవిపై ఆశ వదులకోవాల్సిందే. గుంటూరు జిల్లాలో సీనియర్ నేతలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ లాంటి వాళ్లున్నారు. గుంటూరు జిల్లాలో ఇప్పటికే నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్ ఉండటంతో మరొకరికి మంత్రి పదవి దక్కే అవకాశం లేదు. అందుకే వీరిలో కొందరికి మాత్రం ఏదో ఒక కేబినెట్ ర్యాంక్ పదవి దక్కే అవకాశాలున్నాయంటున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన కమ్మ సామాజికవర్గం ఎమ్మెల్యేలు మాత్రం ఈ దఫా కేబినెట్ లో చోటు దక్కడం కష్టంగానే ఉంది. ఇక కృష్ణా జిల్లాలో కమ్మ సామాజికవర్గం నేతలున్నప్పటికీ వారిలో పెద్దగా సీనియర్లు లేకపోవడం కొంత కలసి వచ్చే అంశమే. గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారే. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఒకరకంగా సీనియర్ అనే చెప్పుకోవాలి. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక బీజేపీ నుంచి కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరి కూడా ఆ సామాజికవర్గమే అయినా బీజేపీ కేంద్ర నాయకత్వం విస్తరణలో వీరిద్దరికీ చోటు కల్పిస్తుందని చెప్పలేని పరిస్థితి. ఇందులో కామినేని సీనియర్. సుజనా చౌదరి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. కృష్ణా జిల్లాలో బీసీ వర్గానికి చెందిన కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారధి కూడా ఉండటంతో కూటమిలోని కమ్మ సామాజికవర్గం నేతలకు కేబినెట్ లో చోటు దక్కే ఛాన్స్ లేదు.

# షర్మిళకు దారేదీ...



కడప, ఆగస్టు 22, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల పునరాలోచనలో పడ్డారా? కాంగ్రెస్ లో కొనసాగితే ఇక రాజకీయ భవిష్యత్ ఉండదని ఆమె ఒక క్లారిటీకి వచ్చినట్లు తెలిసింది. అందుకే అప్పుడప్పుడు అలా వచ్చి ఇలా వెళుతున్నారంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎటు చూసినా కాంగ్రెస్ పార్టీకి రాజకీయ భవిష్యత్ లేదు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ కు దాదాపుగా నూకలు చెల్లినట్లే. అసలు ఓటు బ్యాంకు కూడా లేదు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తం వైసీపీ అధినేత జగన్ కొల్లగొట్టుకుని వెళ్లిపోయారు. ఆ ఓటు బ్యాంకును తిరిగి సాధించడం మాత్రం జరిగే పని కాదు. ఒకవైపు అనాలోచితంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ ను క్షమించకూడదని ప్రజల్లో బలంగా సెంటిమెంట్ నాటుకుపోయింది. అదే సమయంలో జగన్ పార్టీకి దాదాపు పదేళ్ల నుంచి అలవాటుపడిపోయిన ఓటు బ్యాంకు తిరిగి కాంగ్రెస్ వైపునకు చూసే ఛాన్స్ లేదు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన చేసిన తర్వాత ఎన్ని మార్పులు చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరకు వైఎస్ కుమార్తె అయిన షర్మిలను తెచ్చిపెడితే కనీసం కొన్ని సీట్లు అయినా రకపోతాయా? అని భావించి ఆమెకు పీసీసీ చీఫ్ పదవి ఇచ్చింది. అయితే గత ఎన్నికల్లో సేమ్ సీన్ రిపీట్ అయింది. షర్మిల కూడా పోటీ చేసి ఓటమి పాలు కావడంతో ఇక పార్టీ కేంద్ర నాయకత్వానికి కూడా ఆంధ్రప్రదేశ్ పై ఆశలు వదిలేసుకుంది. అందుకే పెద్దగా ఏపీ పాలిటిక్స్ ను పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదని అంటున్నారు.ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ కాంగ్రెస నాయకులు కూడా... రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ దేశమంతా అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావిస్తున్నప్పటికీ ఏపీ పేరును ఎత్తకపోవడం ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. మరొకవైపు వైఎస్ షర్మిల నాయకత్వంపై కూడా చాలా మంది నేతలలో ఉన్న అపోహలు తొలిగిపోయాయంటున్నారు. షర్మిల తన పదవిని అడ్డం పెట్టుకుని కేవలం తన సోదరుడు జగన్ పై విమర్శలు చేయడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని, వ్యక్తిగత విభేదాలకే పెద్దపీట వేస్తున్నారని అంటున్నారు. అందుకే పార్టీలో సీనియర్ నేతలు హర్షకుమార్, చింతామోహన్ వంటి నేతలు కూటమి ప్రభుత్వంపై గళం విప్పాల్సి వస్తుందంటున్నారు. ఈ సమయంలో వైఎస్ షర్మిల వేరే దారి వెతుక్కోవాల్సిందేనా? అన్న అభిప్రాయం ఆమె అనుచరుల నుంచి వినిపిస్తుంది. కాంగ్రెస్ లో ఎన్నాళు న్నా ఇంతే పరిస్థితి అని వారు షర్మిలకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. మరి వైఎస్ షర్మిల ఏం నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# వార్నింగ్ లతో దారికొచ్చేనా

విజయవాడ, ఆగస్టు 22ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసి మీద ఉన్నారు. పార్టీ నేతల మధ్య విభేదాలను తొలగించేందుకు ఆయన నేరుగా రంగంలోకి దిగుతున్నారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో నేతల మధ్య తగాదాలను పరిష్కరించాలన్న భావనలో ఉన్నారు. నేతల మధ్య తలెత్తుతున్న విభేదాలు చివరకు పార్టీ ఉనికికే ప్రశ్నార్థకంగా మారనున్నాయి. క్యాడర్ కూడా రెండుగా విడిపోవడం వల్ల ప్రత్యర్థులు లాభపడతారు. ఆ అవకాశం ఇవ్వకూడదన్న విషయం చంద్రబాబుకు తెలియంది కాదు. అందుకే ఎక్కడ ఏ చిన్న వివాదం తలెత్తినా ఆయన నేరుగా ఎంట్రీ ఇచ్చి విభేదాలను పరిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. నివేదికలు కోరుతున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో... అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అక్కడ ప్రభాకర్ చౌదరికి, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ కు మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. సీటు దక్కకపోయినా తాను దగ్గుబాటి ప్రసాద్ విజయం కోసం పనిచేసినా గెలిచిన తర్వాత తన అనుచరులను అణగదొక్కుతున్నారన్న అభిప్రాయం ప్రభాక్ చౌదరిలో ఉంది. అదేసమయంలో ఆయన జూనియర్ ఎన్టీఆర్ సినిమాపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారి పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. రాష్ట్రంలోని జూనియర్ ఎన్టీఆర్ అభిమానులంతా ఏకమై అనంతపురం ఎమ్మెల్యే నివాసం ఎదుట ఆందోళనకు దిగారు. దీని వెనక ప్రభాకర్ చౌదరి ఉన్నారంటూ దగ్గుబాటి ప్రసాద్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరినీ పిలిచి చంద్రబాబు నాయుడు క్లాస్ పీకినట్లు తెలిసింది. ...ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ కూన రవికుమార్ విషయంలోనూ... ఇక శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ఆయనకు అక్కడ మంత్రి అచ్చెన్నాయుడుకు మధ్య పొసగడం లేదు. అదే సమయంలో తాజాగా ఒక ప్రిన్సిపల్ బదిలీ వివాదంలో కూన రవికుమార్ చిక్కుకున్నారు. ప్రిన్సిపల్ ఆత్మహత్యాయత్నం చేయడంతో అది పార్టీకి ఇబ్బందికరంగా మారింది. కూన రవికుమార్ కొంత దూకుడుగా ఉంటారు. ఇసుక దందాలు, కేజీబీవీ ప్రిన్సిపల్ సౌమ్య వివాదంతో ఆయన పార్టీని ఇబ్బందుల పాటు చేస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన కూన రవికుమార్ కు కనీసం కేబినెట్ ర్యాంక్ పదవి దక్కకపోవడంతో ఆయన అసహనంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కూన రవికుమార్ నుంచి కూడా చంద్రబాబు నివేదికను కోరినట్లు తెలిసింది. దీనిపై త్వరలో కూనను పిలిచి చంద్రబాబు మాట్లాడతారని తెలిసింది.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి వర్గ సమావేశంలో మంత్రుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫైళ్లను పరిశీలించి దానిపై సంతకం చేయాలని అన్నారు. అధికారులు మాటగా కాకుండా లోతుగా అధ్యయనం చేయాలని, ఫైలు పూర్వాపరాలను కూడా తెలుసుకుని క్లియర్ చేయడం మంచిదని సూచించినట్లు తెలిసింది. అలాగే తమకు ఇన్ ఛార్జి పదవి అప్పగించిన జిల్లాల్లో ఎమ్మెల్యేల పనితీరును కూడా గమనించాలని ఆయన కోరినట్లు తెలిసింది. కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలి పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా తయారైందని, వారిని కంట్రోల్ చేసే బాధ్యత మంత్రులు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ప్రధానంగా ఎమ్మెల్యేలు తీరు మార్చుకోకుంటే తానే స్వయంగా జోక్యం చేసుకోక తప్పదని హెచ్చరించినట్లు తెలిసింది. తప్పు చేసిన వారు ఎవరైనా వదిలేది లేదని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యేలు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని, జనంలో ఉండాలని, అంతే తప్ప నిత్యం వివాదాల్లో కాదన్న విషయం గుర్తుంచుకోవాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్న విపక్షాలు జనంలోకి తీసుకెళ్లి పార్టీతో ప్రభుత్వం కూడా అభాసుపాలు జేసేలా వ్యవహరిస్తారని చంద్రబాబు అన్నారు. అలాగే మహిళల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వ సిబ్బంది, అధికారుల పట్ల మర్యాదపూర్వకంగానే వ్యవహరించాలని, ఏదైనా తప్పు జరిగితే అది ఎత్తి చూపే అవకాశం వేరే మార్గాల ద్వారా ఉంటుందని ఆయన అభిప్రాయపడినట్లు తెలిసింది. సోషల్ మీడియా ప్రజల్లోకి విస్తృతంగా వెళుతున్న ఈ సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా నష్టం వాటిల్లేది వ్యక్తిగతంగా మాత్రమే కాదని, కూటమి ప్రభుత్వానికి అని గుర్తుంచుకోవాలని చంద్రబాబు సీరియస్ గా వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. రోడ్డు మీదకువచ్చి దాడులు చేసే సంస్కృతి ఏంటని ఆయన అభిప్రాయపడినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని,పార్టీ పరంగా కాకుండా భవిష్యత్ లో వారికి రాజకీయం చేసేందుకు కూడా అవకాశం ఉండదని ఒకింత గట్టిగానే చంద్రబాబు నాయుడు హెచ్చరించినట్లు చెబుతున్నారు. మొత్తం మీద మంత్రి వర్గ సమావేశంలో చంద్రబాబు లైన్ దాటుతున్న ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం

# జిల్లాల పర్యటనకు జనసేనాని

విశాఖపట్టణం, ఆగస్టు 22, జనసేన పార్టీ ఈ నెల 30వ తేదీన విశాఖపట్నంలో పార్టీ కార్యకర్తల సమావేశం పెడుతుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సమావేశానికి హాజరవుతారు. అయితే విశాఖపట్నం నుంచి ఇక కార్యకర్తల్లో జోష్ నింపేందుకు పవన్ కల్యాణ్ సిద్ధమయినట్లు కనిపిస్తుంది. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలతో పాటు కూటమిపైన తన పట్టు నిలుపుకునే ప్రయత్నంలో భాగంగానే ఆయన వరసగా కార్యకర్తల సమావేశాలు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయిన తర్వాత సరైన పదవులు రాకపోవడంతో పాటు, కూటమిలోని ఇతర పార్టీల నేతల నుంచి సహకారం అందడం లేదని కార్యకర్తలు కొంత అసంతృప్తితో ఉన్నారు.. ఈ సమయంలో క్యాడర్ లో జోష్ నింపేందుకు పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటనలు పెట్టుకున్నట్లు తెలిసింది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరగనున్నాయి. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈసారి ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్ కార్యకర్తలను ముందుగా ప్రిపేర్ చేయడానికి ఈ కార్యక్రమం భుజానకెత్తుకున్నట్లు తెలిసింది. ప్రతి జిల్లాలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారికి సరైన భరోసా ఇవ్వడంతో పాటు భవిష్యత్ లో తన ప్రణాళిక ఏంటన్నది కూడా పవన్ వివరించే అవకాశముందని తెలుస్తుంది. దీనివల్ల పార్టీకి, క్యాడర్ కు మధ్య ఉన్న గ్యాప్ తొలిగిపోతుందని ఆయన భావిస్తున్నారు.ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ ఎందుకు సర్దుకుపోతున్నానని... నిజానికి వచ్చే నెల నుంచి పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన చేయాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేయడానికి జిల్లాల పర్యటనను సెప్టంబరు నుంచి చేస్తానని ఇటీవల మీడియాకు తెలిపారు. అందులో భాగంగానే ఈ నెలాఖరులోనే ఆయన విశాఖ జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరు కానున్నారు. కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ ఇప్పటికే సర్దుకుపోతున్నారన్న అభిప్రాయం కలిగింది. అయితే తాను ఎందుకు సర్దుకుపోతున్నానో కార్యకర్తలకు వివరించే అవకాశముంది. అలాగే జిల్లాలో టీడీపీ నేతలు సహరించకపోతే పార్టీ నాయకత్వానికి తెలియచేయడానికి ఒక నాయకుడిని కూడా నియమించే ఆలోచనను పవన్ కల్యాణ్ చేస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన విశాఖ తో ప్రారంభమయినట్లేనని అంటున్నారు.

# డ్రోన్లతో ఆటకట్టిస్తున్నారు...

విశాఖపట్టణం, ఆగస్టు 22, ఏపీ పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేసులను ఛేదించడంలో టెక్నాలజీని వాడుకుంటున్నారు. ముఖ్యంగా డ్రోన్ల సహకారంతో నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. డ్రగ్స్, గంజాయి సహా పలు నేరాలను అరికట్టడానికి పోలీసులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. డ్రోన్లతో నేరాలు సైతం తగ్గుముఖం



పడుతుండడం విశేషం. తాజాగా చిత్తూరు జిల్లాలో పోలీసులు డ్రోన్ల సాయంతో అంతర్ జిల్లా జూద ముఠా ఆట కట్టించారు. పొదల్లో పేకాట ఆడుతున్న వారిని డ్రోన్ల సాయంతో పట్టుకున్నారు. వారి నుంచి భారీగా నగదు, సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు.చిత్తూరు జిల్లా ముసలి పేడు పొలాల్లో గుంపుగా కొంతమంది పేకాట ఆడుతున్నారు. దీనిపై సమాచారం రావడంతో పదిమంది పోలీసులు డ్రోన్ల సాయంతో వెతుకులాట ప్రారంభించారు. ఓ పొలం సమీపంలోని పొదల్లో ఎవరికీ కనిపించకుండా వారు పేకాట ఆడుతున్నారు. ఆ లోపలికి వెళ్లిన డ్రోన్.. అక్కడ పదుల సంఖ్యలో మనుషులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించింది. పోలీసులకు సమాచారం రావడంతో ఆ పొదల్లోకి వెళ్లి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. తిరుపతికి చెందిన ఇద్దరు, కడప జిల్లాకు చెందిన ఐదుగురు, రాజంపేటకు చెందిన ఇద్దరు, మరో ఇద్దరు స్థానికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,36,740 నగదు తో పాటు 12 సెల్ ఫోన్లు, నాలుగు బైక్ లను స్వాధీనం చేసుకున్నారు. మరో 9 మంది పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుల చేతికి డ్రోన్ వచ్చింది. డ్రోన్ టెక్నాలజీని వాడుకొని నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పోలీసులు అరికడుతున్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నిఘా పెంచారు. దొంగతనాలు, గంజాయి వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలను డ్రోన్ల ద్వారా గుర్తిస్తున్నారు. డ్రోన్ల సాయంతో పోలీసులు నేరాలను నియంత్రిస్తున్నారు. ఊరికి దూరంగా ఉండే ఖాళీ స్థలాలు, శిథిల భవనాల్లో గంజాయి తాగుతున్న వారిని పట్టుకుంటున్నారు. బహిరంగంగా మద్యం తాగే వారిని, అసాంఘిక శక్తులు గుమిగూ డే ప్రాంతాలను సైతం గుర్తించి వేగంగా అక్కడకు చేరుకుంటున్నారు. వారిని అదుపులోకి తీసుకోగలుగుతున్నారు.విశాఖ జిల్లాలో మన్య ప్రాంతంలో విపరీతంగా గంజాయి సాగు అవుతోంది. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడుతున్న దాని మూలాలు విశాఖను చూపిస్తున్నాయి. దీంతో డ్రోన్ల సాయంతో గంజాయి సాగుపై దృష్టి పెట్టారు పోలీసులు. మన్య ప్రాంతంలో గంజాయి సాగుతున్న ప్రాంతాలను గుర్తించి దహనం చేస్తున్నారు. అప్పటినుంచి పోలీస్ శాఖలో డ్రోన్ల వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించారు. జిల్లాల్లో ప్రధాన పోలీస్ స్టేషన్లకు ఇప్పటికే డ్రోన్లు అందించారు. మిగతా పోలీస్ స్టేషన్లకు సైతం అందించనున్నారు.

# ఎన్డీయేకు జగన్ మద్దతు

విజయవాడ, ఆగస్టు 22,రాజకీయాల్లో ప్రత్యర్థి ఎవరో తెలుసుకోకపోతే మొదటికే మోసం వస్తుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు తన ప్రత్యర్థి ఎవరో తేల్చుకోలేకపోతున్నారు. ఏపీలో అధికారంలో ఉన్న కూటమికి ఢిల్లీలో మద్దతు పలికారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తాము బీజేపీ అభ్యర్థికే మద్దతు ఇస్తామని ఆ పార్టీ నేత బొత్స సత్యనారాయణ ప్రకటించారు. నెంబర్ గేమ్ ఉండొద్దన్నది తమ విధానమని అందుకే గతంలో ప్రణబ్ ముఖర్జీకి కూడా మద్దతిచ్చామని ఇప్పుడు బీజేపీకి మద్దతిస్తామని ప్రకటించారు. బొత్స ప్రకటన వైసీపీ వర్గాలను సైతం తీవ్రంగా నిరాశపరిచిందని చెప్పుకోవచ్చు.గత ఎన్నికల్లో జగన్ ఎవరి చేతిలో ఓడిపోయారు ?. ఎన్డీఏ చేతిలో ఓడిపోయారు. బీజేపీ నేతలు రాష్ట్రానికి వచ్చి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి ఆరోపణలు చేశారు. చివరికి మూడు పార్టీల కూటమి ఆయనకు ప్రతిపక్ష నేత హోదా కూడా లేకుండా ఓడించింది. అయినా ఇప్పుడు ఎన్డీఏకే ఢిల్లీలో మద్దతు ప్రకటించారు. పోనీ ఇప్పుడు కాకపోతే తర్వాత అయినా బీజేపీతో పొత్తులు పెట్టుకునే అవకాశాలు ఉన్నాయా అంటే అలాంటి చాన్సే లేదని రాజకీయ సమీకరణాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. జగన్ మోహన్ రెడ్డి ఓటు బ్యాంకు దళితులు, ముస్లింలు.. అంటే పూర్తిగా కాంగ్రెస్ ఓటు బ్యాంక్.ఆయన బీజేపీతో పొత్తులు పెట్టుకున్న మరుక్షణం ఆయన ఓటు బ్యాంక్ ఆయనకు దూరమైపోతుంది. అది రాజకీయంగా ఆత్మహత్యాసదృశం అవుతుంది. అందుకే గత ఎన్నికలకు ముందు బీజేపీతో పొత్తులు పెట్టుకోకుండా ఉండేందుకు జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా బీజేపీ పట్టించుకోలేదని చెబుతారు. ఎప్పుడూ పొత్తులు పెట్టుకోలేనప్పుడు.. ఇప్పుడు మద్దతు ఇవ్వడం ఎందుకన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. జగన్మోహన్ రెడ్డి తీవ్రమైన అవినీతి ఆరోపణల్లో ఇరుక్కున్నారు. ఆయనపై ఉన్న సీబీఐ కేసులకు తోడు లిక్కర్ స్కాం సహా పలు కేసులు మెడకు చుట్టుకునే అవకాశాలు ఉన్నాయి. వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు సుప్రీంకోర్టు అనుమతి ఇస్తే..అది కూడా ఆయనకు చిక్కులు తెచ్చి పెడుతుదని చెబుతున్నారు

# స్పోర్ట్స్ న్యూస్

## సెలెక్షన్ కమిటీ నుంచి అవుట్: మాజీ స్టార్ స్పిన్నర్ కు పిలుపు?

సెప్టెంబర్ 9వ తేదీన ఆరంభం కానున్న ఆసియా కప్ 2025లో ఆడబోయే భారత జట్టుపై అప్పుడే అసహనం, అసంతృప్తి చెలరేగింది. ఈ జట్టులో ఇద్దరు టీ20 స్పెషలిస్టులకు చోటు దక్కకపోవడమే దీనికి కారణం. ఉద్దేశపూరకంగానే వారిని ఎంపిక చేయలేదనే వాదనలు మొదలయ్యాయి.మొత్తం 15 మంది సభ్యులతో కూడిన జట్టును బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, టీమిండియా టీ20 ఫార్మట్ కేప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మంగళవారం వెల్లడించిన విషయం తెలిసిందే. టెస్ట్ ఫార్మట్ కేప్టెన్ శుభ్‌మన్ గిల్ కు వైస్ కేప్టెన్సీ బాధ్యత అప్పగించారు. జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇచ్చాడు.యశస్వి జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లకు చోటు దక్కలేదు. సంజూ శాంసన్‌కు బ్యాకప్ వికెట్ కీపర్‌గా జితేష్ శర్మను ఎంపిక చేశారు. పేస్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యాతో పాటు శివమ్ దూబే అవకాశాన్ని అందుకున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలను కొనసాగించారు. మూడో పేసర్‌గా హర్షిత్ రాణాను తీసుకున్నారు.యశస్వి జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్ కు చోటు దక్కకపోవడం చర్చనీయాంశమౌతోంది. టీ20 ఫార్మట్ లో సాగే ఐపీఎల్ మ్యాచ్ లల్లో ఆడిన అపారమైన అనుభవం ఉన్నప్పటికీ వారిద్దరినీ ఎంపిక చేయపోవడం పట్ల మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్, క్రిష్ణమాచారి శ్రీకాంత్ వంటి లెజెండరీ ప్లేయర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోన్నారు. బీసీసీఐ నిర్ణయాలపై మండిపడుతున్నారు.ఈ పరిస్థితుల మధ్య సెలెక్షన్ కమిటీలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది బీసీసీఐ. ఇద్దరు సెలెక్టర్లపై వేటు వేసింది. వారి కాంట్రాక్ట్ గడువును పొడిగించలేదు. ఈ ఇద్దరి స్థానాన్ని భర్తీ చేయడానికి దరఖాస్తులను సైతం ఆహ్వానించింది. ఈ మేరకు కొద్దిసేపటి కిందటే తన అధికారిక వెబ్ సైట్ లో దీనికి సంబంధించిన వివరాలను పొందుపరిచింది.ప్రస్తుతం బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ప్యానెల్‌కు భారత మాజీ ఫాస్ట్ బౌలర్ అజిత్ అగార్కర్ నేతృత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో శివ సుందర్ దాస్ (సెంట్రల్ జోన్), సుబ్రతో బెనర్జీ (ఈస్ట్ జోన్), అజయ్ రాత్రా (నార్త్ జోన్), శ్రీధరన్ శరత్ (సౌత్ జోన్) ఉన్నారు. వీరిలో శరత్, అజయ్ రాత్రాను తొలగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. శరత్ స్థానంలో భారత మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓఝా వచ్చే అవకాశం ఉంది.అజిత్ అగార్కర్ 2026 వరకు చీఫ్ సెలక్టర్‌గా కొనసాగే అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం ఏడు టెస్ట్ మ్యాచ్‌లు లేదా 30 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఉండాలి. కనీసం 10 వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు లేదా 20 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లలో అనుభవం ఉన్న అభ్యర్థులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు.భారత జట్టును అన్ని ఫార్మాట్లలో అంటే టెస్టులు, వన్డే ఇంటర్నేషనల్స్, టీ20 ఇంటర్నేషనల్స్, బీసీసీఐ నిర్ణయించిన ఇతర ఫార్మాట్లలో ఎంపిక చేయాల్సి ఉంటుంది. క్రికెట్ నుండి కనీసం ఐదేళ్ల ముందు రిటైర్ అయి ఉండాలి. గతంలో అయిదేళ్ల పాటు బీసీసీఐ క్రికెట్ కమిటీలో సభ్యుడిగా ఉండకూడదు.అగార్కర్‌ను జూలై 2023లో నియమించారు. అతని హయాంలో జాతీయ జట్టు 2023 ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకోవడం, 2024లో ఐసీసీ టీ20 ప్రపంచ కప్ గెలవడం, 2025లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలవడం వంటి అనేక కీలక విజయాలను సాధించింది. ఈ విజయాలు అగార్కర్‌ను కొనసాగించడానికిప్రధాన కారణాలుగా బీసీసీఐ పరిగణిస్తోంది.





## రోహిత్ గౌరవంగా తప్పుకోవాల్సిన సమయం వచ్చిందా? ఏం జరుగుతోంది?

సెప్టెంబర్ 9వ తేదీన ఆరంభం కానున్న ఆసియా కప్ 2025లో ఆడబోయే భారత జట్టుపై అప్పుడే అసహనం, అసంతృప్తి చెలరేగింది. ఈ జట్టులో ఇద్దరు టీ20 స్పెషలిస్టులకు చోటు దక్కకపోవడమే దీనికి కారణం. ఉద్దేశపూరకంగానే వారిని ఎంపిక చేయలేదనే వాదనలు మొదలయ్యాయి.మొత్తం 15 మంది సభ్యులతో కూడిన జట్టును బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, టీమిండియా టీ20 ఫార్మట్ కేప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మంగళవారం వెల్లడించిన విషయం తెలిసిందే. టెస్ట్ ఫార్మట్ కేప్టెన్ శుభ్‌మన్ గిల్ కు వైస్ కేప్టెన్సీ బాధ్యత అప్పగించారు. జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇచ్చాడు.ఈ జట్టులో- యశస్వి జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్ కు చోటు దక్కకపోవడం చర్చనీయాంశమౌతోంది. టీ20 ఫార్మట్ లో సాగే ఐపీఎల్ మ్యాచ్ లల్లో ఆడిన అపారమైన అనుభవం ఉన్నప్పటికీ వారిద్దరినీ ఎంపిక చేయపోవడం పట్ల మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్, క్రిష్ణమాచారి శ్రీకాంత్ వంటి లెజెండరీ ప్లేయర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోన్నారు. బీసీసీఐ నిర్ణయాలపై మండిపడుతున్నారు.శ్రేయాస్ అయ్యర్, జైస్వాల్ ను జట్టులోకి తీసుకోకపోవడం దురదృష్టకరమని, వారిద్దరికీ తీవ్ర అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించాడు. జట్టు సెలెక్షన్ అనేది థ్యాంక్స్ లెస్ జాబ్ గా మారిందని విమర్శించాడు. ప్రపంచ కప్ గెలిచిన జట్టులో సభ్యుడైన జైస్వాల్ ను తొలగించి శుభ్‌మన్ గిల్‌ను జట్టులోకి తీసుకువచ్చారని, అది సంతోషకరమే అయినప్పటికీ.. శ్రేయాస్, జైస్వాల్ ను పక్కనపెట్టడం సరికాదని అన్నాడు.ఈ పరిస్థితుల మధ్య బీసీసీఐ కీలక ప్రతిపాదనలను తెర మీదికి తీసుకొచ్చింది. వన్డే ఫార్మట్ కు శ్రేయాస్ అయ్యర్ ను కేప్టెన్ గా నియమించాలని భావిస్తోంది. ప్రస్తుత కేప్టెన్ రోహిత్ శర్మను తొలగించి.. అతని స్థానంలో అయ్యర్ కు కేప్టెన్సీ పగ్గాలను ఇవ్వాలనే అంశంపై చర్చిస్తోన్నట్లు సమాచారం.అదే సమయంలో టీ20 ఫార్మట్ కేప్టెన్సీలో కూడా భారీ మార్పులు చేర్పులు చేయడానికి బీసీసీఐ రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న సూర్యకుమార్ యాదవ్ ను తొలగించి అతని స్థానంలో వైస్ కేప్టెన్ శుభ్ మన్ గిల్ కు ఆ బాధ్యతలను అప్పగించడం దాదాపు ఖాయమైందని అంటున్నారు. ఆసియా కప్ 2025 తర్వాత ఈ మార్పు ఉండొచ్చు.మూడు ఫార్మట్లకు ఇద్దరే కేప్టెన్లు ఉండాలని బీసీసీఐ భావిస్తోంది. ప్రస్తుతం వన్డేలకు రోహిత్ శర్మ, టీ20కి సూర్యకుమార్ యాదవ్, టెస్ట్ ఫార్మట్ కు శుభ్ మన్ గిల్ నాయకత్వాన్ని వహిస్తోన్న విషయం తెలిసిందే. గిల్ కు టెస్టులతో పాటు టీ20 ఫార్మట్ సారధ్య బాధ్యతలను కూడా అప్పగించాలని బీసీసీఐ యోచిస్తోంది. ఈ క్రమంలోనే ఈ మార్పులకు తెర తీసినట్లు చెబుతున్నారు.ఈ ప్రతిపాదనలపై రోహిత్ శర్మ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తోన్నారు. రోహిత్ శర్మను తప్పించే ప్రయత్నాలను విరమించుకోవాలని తేల్చి చెబుతున్నారు. ఎ౦ఔఆఎం ఔఇఇఊా అంఖుంఎఔ ఖీూఊమి అనే ట్యాగ్ కింద వేల సంఖ్యలో పోస్టులు పెడుతున్నారు. దీంతో ఈ పదం ట్రెండింగ్ అవుతోంది. 75 వేలకు పైగా పోస్టులు పడ్డాయంటే అభిమానులు ఏ రేంజ్ లో దీన్ని వ్యతిరేకిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.




## స్పాన్సర్ లేకుండానే భారత్.. బీసీసీఐకి భారీ నష్టం!

ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లుతో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)కి భారీ నష్టం వాటిల్లనుంది. టీమిండియాకు జెర్సీ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న డ్రీమ్ 11.. కొత్తగా తెచ్చిన గేమింగ్ నియంత్రణ బిల్లు ద్వారా తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో జెర్సీ స్పాన్సర్ లేకుండా ఆసియా కప్ 2025లో టీమిండియా ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వచ్చే నెల 9న యూఏఈ వేదికగా ఆసియాకప్ 2025 ప్రారంభం కానుంది. ఆలోపు కొత్త స్పాన్సర్ దొరక్కపోతే మెయిన్ స్పాన్సర్ లేకుండానే భారత జట్టు టోర్నీలో పాల్గొననుంది.ఇక నగదుతో కూడిన ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఉభయ సభల్లో ఎలాంటి చర్చ లేకుండానే ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లుకు ఆమోదం లభించింది. లోక్ సభలో ఆమోదం పొందిన తర్వాత.. రాజ్యసభలో మూజువాణి ఓటు ద్వారా “ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు” ఆమోదం పొందింది. ఈ కొత్త చట్టం ప్రకారం ఆన్‌లైన్ మనీ గేమ్‌లను ఆడితే గరిష్ఠంగా 3 సంవత్సరాల జైలు శిక్ష లేదా రూ. 1 కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.భారత క్రీడా ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త బిల్లు క్రీడా రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. దేశంలో జరుగుతున్న క్రీడా టోర్నీలకు గేమింగ్ యాప్స్ సంస్థలే స్పాన్సర్ చేస్తున్నాయి. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడా టోర్నీలకు కూడా కోట్ల రూపాయాలను వెచ్చిస్తున్నాయి. కానీ తాజా బిల్లు కారణంగా ఆ సంస్థలన్నీ తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిశ్రమ నిపుణుల అంచనాల ప్రకారం, ఫాంటసీ గేమింగ్ సంస్థలు ఏటా ?5,000 కోట్ల వరకు ప్రకటనల కోసం ఖర్చు చేస్తాయి, వీటిలో ఎక్కువ భాగం క్రికెట్‌కు సంబంధించిన టోర్నమెంట్లకే వెళ్తుంది. ఈ ఆదాయం పూర్తిగా తగ్గే అవకాశం ఉంది.డ్రీమ్11 ప్రస్తుతం భారత క్రికెట్ జట్టుకు అధికారిక జెర్సీ స్పాన్సర్‌గా ఉంది. ఈ సంస్థ బీసీసీఐతో 2023 నుంచి 2026 వరకు ?358 కోట్ల ఒప్పందం కుదుర్చుకుంది. ఏడాదికి సగటున డ్రీమ్ 11 బీసీసీఐకి సుమారు ?119.33 కోట్లు చెల్లిస్తుంది. ఇందులో స్వదేశం జరిగే ప్రతి అంతర్జాతీయ మ్యాచ్‌కు రూ. 3 కోట్లు, విదేశాల్లో జరిగే ప్రతీ మ్యాచ్‌కు రూ. కోటి చెల్లిస్తుంది. తాజా బిల్లుతో డ్రీమ్ 11 తప్పుకోవడం లేదా బీసీసీఐ నిషేధం విధించాల్సిన పరిస్థితి అనివార్యమైంది. కొత్త స్పాన్సర్ దొరక్కపోతే బీసీసీఐకి కోట్ల రూపాయాల్లో నష్టం వాటిల్లనుంది. అయితే బీసీసీఐకి స్పాన్సర్ చేసేందుకు చాలా కంపెనీలు క్యూ కడుతాయి. డ్రీమ్ 11 అంత భారీ ధర చెల్లించకపోయినా కాస్త తక్కువైనా బీసీసీఐకి జెర్సీ స్పాన్సర్ లభించే అవకాశం ఉంది.ఈ విషయంపై బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. దేశ చట్టాలను బోర్డు అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ‘ఈ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం లభించింది. రాష్ట్రపతి అమోదం పొందుతుంది. ఆ తర్వాత నియామక తేదీ ఉంటుంది. అప్పుడు మేము నిర్ణయం తీసుకుంటాం. దేశంలోని ఏ చట్టం అనుమతించని ఏ పనిని బీసీసీఐ చేయదు. ‘అని సైకియా స్పష్టం చేశారు.




## జట్టులో చోటు లేదు.. బెంచ్ మీద ఉండలేకనే వీడ్కోలు పలికాను..!

భారత మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ వీడ్కోలు పలికి నెలలు కావొస్తోంది. కీలకమైన ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలో అతడు ఉన్నపళంగా రిటైర్మెంట్ వార్తతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. టీమిండియా స్పిన్ యూనిట్‌కు పెద్దన్నలా వ్యవహరించే అశ్విన్.. అంత తొందరగా నిర్ణయం తీసుకోవడానికి దారితీసిన పరిస్థితులు అంతుచిక్కలేదు. ప్రస్తుతం ఫ్రాంచైజీ క్రికెట్ మాత్రమే ఆడుతున్న యశ్ తాజాగా తన వీడ్కోలుపై మౌనం వీడాడు.కొన్ని కారణాల వల్లనే తాను అర్ధాంతరంగా ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే తన అంతర్జాతీయ కెరీర్‌ను ముగించాల్సి వచ్చిందని యశ్ తెలిపాడు. యూట్యూబ్ సిరీస్ కుట్టి స్టోరీస్‌లో వీడ్కోలు పలకడానికి కారణం ఏంటీ? అని రాహుల్ ద్రవిడ్ అడిగిన ప్రశ్నకు ఈ వెటరన్ క్రికెటర్ ఆసక్తికర సమాధానం చెప్పాడు.నిరుడు 2024 డిసెంబర్‌లో హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించాడు అశ్విన్. సిరీస్ మధ్యలోనే దిగ్గజ స్పిన్నర్ అలా వైదొలగడం పలు సందేహాలకు తావిచ్చింది. కొన్ని నెలలుగా మౌనంగా ఉన్న అతడు ఎట్టకేలకు ఓపెన్ అయ్యాడు. ‘బోర్డర్ ? గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టు ముగిసిన తర్వాత వీడ్కోలు బాంబ్ పేల్చాడు. సమయం రాగానే వీడ్కోలు పలకాలని అనుకున్నా. నేను జీవితంలో ఏ దశలో ఉన్నాను? అని ఆలోచించాను. నాకు వయసైపోతుందని గ్రహించాను. స్క్వాడ్‌తో పాటు విదేశీ పర్యటనలకు వెళ్లడం వరకూ బాగానే ఉంటుంది. కానీ, పదకొండు మందిలో లేకుండా ఎక్కువ రోజులు బెంచ్‌మీద కూర్చోవడం ఎంతో బాధిస్తుంది. నాకూ అదే పరిస్థితి ఎదురైంది. సో.. ఇక నా కెరీర్ ముగించేందుకు సమయం వచ్చిందని అర్ధమైంది. అందుకే.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలోనే ప్రకటన చేశాను’ అని అశ్విన్ పేర్కొన్నాడు.అంతేకాదు కుటుంబంతో గడపాలనే ఆలోచన కూడా వీడ్కోలు నిర్ణయానికి ఒక కారణమని ఈ స్పిన్ దిగ్గజం అన్నాడు. ‘దేశానికి ఆడకూడదనే ఆలోచన ఎప్పుడూ నాకు రాలేదు. కానీ, అదే సమయంలో కుటుంబానికి సమయం కేటాయించడం, పిల్లలతో గడపడం చాలా ముఖ్యమని భావించాను. నా ఇద్దరు కూతుళ్లు పెద్దవాళ్లు అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంకా కెరీర్‌ను పొడిగించడం కంటే వీడ్కోలు చెప్పడమే మంచిదని అనిపించింది. మరో విషయం నాకు 34-35 ఏళ్ల వచ్చాక రిటైరవ్వాలని కెరీర్ ఆరంభంలోనే అనుకున్నా. కానీ, కాస్త ఆలస్యం అయింది. దేశానికి ప్రాతినిధ్యం వహించడం నిజంగా నాకు దక్కిన గొప్ప గౌరవం’ అని అశ్విన్ వెల్లడించాడు. 106 టెస్టులు ఆడిన ఈ తమిళ తంబీ 537 వికెట్లు తీశాడు. ఎనిమిదిసార్లు పది వికెట్లు, 37సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడీ స్పిన్ లెజెండ్.



## ఫ్లాట్ కొనుగోలు చేసిన సచిన్ టెండూల్కర్ భార్య.. ధర తెలిస్తే షాకే..!

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సతీమణి అంజలి టెండూల్కర్ కొత్త ఇంటిని కొనుగోలు చేశారు. ముంబై సమీపంలోని విరార్ ప్రాంతంలో చాలా తక్కువ ధరకే ఫ్లాట్‌ను కొన్నారు. దాని ధర తెలిస్తే అంతా షాక్ అవుతారు. రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం.. అంజలి కొనుగోలు చేసిన ఫ్లాట్ విస్తీర్ణం కేవలం 391 చదరపు అడుగులు మాత్రమే. విరార్‌లోని పెనిన్సులా హైట్స్‌లో ఈ ఫ్లాట్ ఉంది. దీని ధర కేవలం రూ.32 లక్షలు మాత్రమే. ఈ ఏడాది మే 30న అంజలి ఈ ఫ్లాట్ కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి ఆమె రూ. 1.92 లక్షల మేర స్టాంప్ డ్యూటీ చెల్లించారు. ఇక రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ. 30 వేలు చెల్లించినట్లు జాప్‌కీ.కామ్ వెల్లడించింది. కాగా, స్టార్ సెలబ్రిటీ భార్య ఇంత తక్కువ ధరకు ఫ్లాట్ కొనుగోలు చేయడం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.ాగా మహారాష్ట్రలో మహిళలు ఇళ్లను కొనుగోలు చేస్తే పలు రాయితీలు పొందుతారు. మహిళలు ఫ్లాట్లు కొనుగోలు చేస్తే స్టాంపు డ్యూటీ కింద ఒక శాతం రాయితీ ఉంటుంది. దీని ప్రకారం అంజలి కూడా స్టాంప్ డ్యూటీపై 1శాతం రాయితీని పొందారు. అయితే, పట్టణాలు, జిల్లాలను బట్టి ఈ రాయితీ 5 నుంచి 7 శాతం వరకు ఉంటుంది.

## అది టీమిండియా కాదు.. గంభీర్ టీమ్: మాజీ క్రికెటర్ ఫైర్

టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్‌పై మాజీ క్రికెటర్ సదగోప్పన్ రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆసియా కప్ 2025కు శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయకపోవడాన్ని తప్పుబట్టాడు. గంభీర్‌కు నచ్చిన ఆటగాళ్లనే ఎంపిక చేస్తున్నాడని, నచ్చని ఆటగాళ్లను పక్కనపెట్టేస్తున్నాడని ఆరోపించాడు. ఆసియా కప్ 2025 కోసం భారత సెలెక్షన్ కమిటీ 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును గత మంగళవారం ఎంపిక చేసింది.టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వగా.. శ్రేయస్ అయ్యర్‌కు నిరాశే ఎదురైంది. ప్రస్తుతం భారత టీ20 జట్టులో అయ్యర్‌కు చోటు లేదని భారత చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తెలిపాడు. ఇంకొన్నాళ్లు అతను వేచి చూడాల్సిందేనన్నాడు. అయితే శ్రేయస్ అయ్యర్‌ను తప్పించడంపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాచ్ విన్నర్ అయిన అయ్యర్‌ను పక్కనపెట్టి టీమిండియా ఘోర తప్పిదం చేసిందని మండిపడుతున్నారు.తాజాగా ఈ వ్యవహారంపై స్పందించిన సదగోప్పన్ రమేష్.. అయ్యర్ వేటు వెనుక గంభీర్ ఉన్నాడని ఆరోపించాడు. హెడ్ కోచ్‌గా గంభీర్ తీరు బాలేదని విమర్శించాడు. విరాట్ కోహ్లీ సారథ్యంలో విదేశాల్లో టీమిండియా విజయాలు సాధిస్తే.. గంభీర్ పర్యవేక్షణలో మాత్రం ఓటములు, డ్రాలు చేసుకుంటుందన్నాడు. డ్రానే గొప్ప విజయంగా భావిస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించాడు.’ఆసియాకప్ 2025కు శ్రేయస్ అయ్యర్‌ను ఎంపికచేయాల్సింది. కానీ గౌతం గంభీర్ తనకు నచ్చిన ఆటగాళ్లను మాత్రమే ఎంపిక చేస్తున్నాడు. నచ్చని వాళ్లను పక్కనపెడుతున్నాడు. ఇదే యూఏఈ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రేయస్ అయ్యర్ అద్భుతమైన ప్రదర్శన చేశాడు. భారత వైట్‌బాల్ టీమ్‌లో అయ్యర్‌కు శాశ్వతంగా చోటు కల్పించాలి. ఆటగాళ్లు సూపర్ ఫామ్‌తో పాటు ఆత్మవిశ్వాసంతో ఉన్నప్పుడే అండగా నిలవాలి. అంతేకాకుండా ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్నప్పుడు కాదు. సూపర్ ఫామ్‌లో ఉన్న అయ్యర్ నుంచి ఆశించిన ఫలితాన్ని అందుకునేందుకు ఇదే సరైన సమయం.’అని సదగోప్పన్ రమేష్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా చెప్పుకొచ్చాడు.గౌతం గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టీమిండియా మిశ్రమ ఫలితాలను అందుకుంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత్.. టెస్ట్‌ల్లో ఘోర పరాజయాలను చవిచూసింది. న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన భారత్.. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని 3-1తో కోల్పోయింది. ఇటీవల ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్ట్‌ల సచిన్-అండర్సన్ ట్రోఫీని 2-2తో డ్రా చేసుకుంది. అయితే ఈ డ్రాను గొప్ప విజయంగా భావిస్తున్నారని సదగోప్పన్ రమేష్ విమర్శలు గుప్పించాడు.’గతేడాదిగా టెస్ట్‌ల్లో పేలవ ప్రదర్శన చేయడంతోనే ఇంగ్లండ్‌తో సిరీస్‌ను డ్రా చేసుకోవడం గొప్ప విజయంగా కనిపిస్తోంది. ఎందుకంటే కోహ్లీ-రవిశాస్త్రి పర్యవేక్షణలో విదేశీ గడ్డపై టీమిండియా వరుసగా విజయాలు సాధించింది. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్ డ్రా చేసుకోవడం గొప్ప ఘనతగా అనిపిస్తోంది.’అని సదగోప్పన్ రమేష్ చెప్పుకొచ్చాడు.




# అన్ని వంటనూనెల కన్నా ఇదే ది బెస్ట్ కుకింగ్ ఆయిల్!




ఆరోగ్యంగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారంతో పాటు మనం వాడే వంట నూనె విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. ఏం వంట నూనె ఉపయోగిస్తే మంచిది అనేది తెలుసుకోవాలి. ప్రస్తుతం మనం రైస్ బ్రాన్ ఆయిల్ గురించి తెలుసుకుందాం. రైస్ బ్రాన్ ఆయిల్, ఇతర వంట నూనెలతో పోలిస్తే, దాని పోషక గుణాల వల్ల చాలా ఎక్కువ మంది దీనిని వాడుతున్నారు. రైస్ బ్రాన్ ఆయిల్ తో ఆరోగ్య ప్రయోజనాలు బియ్యం గింజల పై పొర నుండి తీసిన ఈ నూనెలో యాంటీఆక్సిడెంట్లు, ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో మోనోఅన్‌సాచురేటెడ్, పాలీఅన్‌సాచురేటెడ్, సాచురేటెడ్ కొవ్వులు సరైన నిష్పత్తిలో ఉండటం వల్ల ఇది వంటకు మరింత ఆరోగ్యకరమైన ఎంపికగా మారుతుంది. ఈ నూనెలో ఒరిజానాల్ అనే సమ్మేళనం అధికంగా ఉంటుంది. ఇది మన శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఒరిజానాల్ రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె ఆరోగ్యానికి కూడా దోహదం చేస్తుంది. రైస్ బ్రాన్ ఆయిల్ తో వంట లకు సహజ రుచి రైస్ బ్రాన్ ఆయిల్ లో విటమిన్ ఇ ఉంటుంది, ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తూ కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది. రైస్ బ్రాన్ ఆయిల్ వేయించడం, బేకింగ్ వంటి అనేక వంట పద్ధతులకు చాలా అనుకూలంగా ఉంటుంది. దీని రుచి చాలా మృదువుగా ఉంటుంది. వంటకాలపై ఎటువంటి ప్రభావం చూపదు. పైగా, రైస్ బ్రాన్ ఆయిల్ పదార్థాల సహజ రుచిని మరింత పెంచడానికి సహాయపడుతుంది. ఈ ఆయిల్స్ తో పోలిస్తే రైస్ బ్రాన్ ఆయిల్ బెస్ట్ ఇది అతి తక్కువ ధరలో మన గుండెకు ఆరోగ్య ప్రయోజనాలను అందించే నూనె. ఆలివ్ ఆయిల్ తో పోలిస్తే, రైస్ బ్రాన్ ఆయిల్ ధర తక్కువ. కొబ్బరి నూనెలా కాకుండా, ఇందులో కొవ్వుల నిష్పత్తి మెరుగ్గా ఉంటుంది, ఇది శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో ఒరిజానాల్ వంటి సమ్మేళనాలు ఉండవు. కనుక సన్ఫ్లవర్ ఆయిల్, ఆలివ్ ఆయిల్ తో పోల్చి చూస్తే రైస్ బ్రాన్ ఆయిల్ మంచిది. ఆరోగ్యానికి , పర్యావరణానికి మేలు చేసే ఆయిల్ రోజువారీ వంటకాల్లో రైస్ బ్రాన్ ఆయిల్ ను వాడటం వల్ల రుచి గానీ, నాణ్యత గానీ తగ్గకుండా పోషక విలువలను పెంచుకోవచ్చు. ఇది మన ఆరోగ్యానికి దోహదం చేయడమే కాకుండా పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది. ధాన్యం పొట్టు వ్యర్థాలతో తీసే ఈ నూనె పర్యావరణ పరిరక్షణలోనూ భాగస్వామ్యం తీసుకుంటుంది.

# గట్ హెల్త్ కు బెస్ట్ ఫుడ్స్ – ఎన్నో సమస్యలకు పరిష్కారం..!!



ఆరోగ్యం గా ఉండాలంటే శరీరానికి పోషకాలు అవసరం. మనం తీసుకునే ఆహారం జీర్ణమై శరీరానికి శక్తిని ఇవ్వటంలో జీర్ణ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తోంది. కడుపు ఆరోగ్యం బాగుంటేనే శరీరం పూర్తి ఫిట్ గా.. అన్ని రకాల శక్తి అందుతుంది. ఏ మాత్రం జీర్ణవ్యవస్థ సక్రమంగా లేకపోయినా.. శరీరం లో ఎన్నో సమస్యలు మొదలవుతాయి. జీర్ణవ్యవస్థ బాగుండాలంటే గట్ ఆహారం చాలా అవసరం. దీని ద్వారా పూర్తిగా జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేస్తుంది. జీర్ణ క్రియను మెరుగు పర్చేందుకు కొన్ని ఫుడ్స్ ను తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణవ్యవస్థను గట్ అని కూడా పిలుస్తారు. ఇది కడుపు, ప్రేగులు మరియు పెద్దప్రేగులను కలిగి ఉంటుంది. జీర్ణవ్యవస్థ సరిగ్గా పని చేయకపోవటానికి అనేక కారణాలు ఉంటాయి. అందులో అధిక యాంటీ బయోటిక్స్ వినియోగం.. ఒత్తిడి.. నిద్ర లేకపోవటం.. శారీరక వ్యాయామ లేమి.. ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవటం వంటివి కారణాలుగా చెబుతున్నారు. ఆరోగ్యకరమైన గట్ నిర్వహణ కోసం పండ్లు, కూరగాయలు, చిక్కుళ్ళు, బీన్స్, గింజలు, తృణధాన్యాలు వంటివి అవసరం. ఎక్కువగా ఫైబర్ ఆహారం జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. పప్పులు, గింజలు, ధాన్యాలు లేదా గింజలు వంటి ఎంపిక చేసిన కూరగాయల వేరియంట్‌లలో లభించే ప్రీబయోటిక్ ఫైబర్‌ల నుండి గట్ ఆరోగ్యం చాలా వరకు ప్రయోజనం పొందవచ్చు. పండ్లు మరియు కూరగాయల ద్వారా శరీరానికి కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు మరియు ఆరోగ్యాన్ని ఇచ్చే పదార్థాలు లభిస్తాయి. తిరుమల కొండకు ఉచిత ప్రయాణం, పరిమితం – ఇక ఫ్రీ బస్సులో ఇవి తప్పనిసరి..!!ర్ణవ్యవస్థలో ప్రేగులకు నీరు తప్పనిసరి. ఇది ఆహారాన్ని జీర్ణం చేయడంతో పాటు పోషకాలను గ్రహించడంలో సహాయపడుతుంది మరియు మలాన్ని మృదువుగా చేస్తుంది. మూలికలు, సుగంధ ద్రవ్యాలు, రంగు రంగుల పండ్లు మరియు కూరగాయలు, గింజలు మరియు గింజలు, గ్రీన్ – బ్లాక్ టీ, కాఫీ, కోకో మరియు డార్క్ చాక్లెట్ వంటి పాలీఫెనాల్స్ అధికంగా ఉండే ఆహారాలు గట్ మైక్రోబయోమ్ కు మేలు చేస్తాయి. పెరుగు, కిమ్చి, సౌర్‌క్రాట్, కేఫీర్, కొంబుచా మరియు టేంపే వంటి పులియబెట్టిన ఆహారాలు జీర్ణ ఆరోగ్యంకు ప్రయోజనకరం. ధ్యానం, నడక, తగినంత నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం. వీటి ద్వారా జీర్ణ వ్యవస్థను బలోపేతం చేసుకుంటే.. శరీరం బలంగా.. ఆరోగ్యంగా ఉంటుంది. ఇతరత్రా సమస్యల పరిష్కారానికి మేలు చేస్తుంది.




# డయాబెటిస్ పేషెంట్స్ రాగిజావ ఎక్కువగా తాగుతున్నారా?



డయాబెటిస్.. ఇప్పుడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి. ప్రతి పదిమందిలో ఐదుగురు డయాబెటిస్ బాధితులు ఉంటున్నారంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. డయాబెటిస్ ను పట్టించుకోకపోతే మనకు తెలియకుండానే మన ప్రాణాలను హరిస్తుంది. డయాబెటిస్ తో బాధపడేవారు మందులు తీసుకోవడంతో పాటు ముఖ్యంగా లైఫ్ స్టైల్ చేంజ్ చేసుకోవడం చాలా అవసరం. అన్నానికి బదులుగా రాగిజావ తినే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించడం, ప్రతిరోజు వ్యాయామం చేయడం, యోగ సాధన చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రతిరోజు ఏడు నుండి ఎనిమిది గంటల పాటు నిద్రపోవడం ఎంతో అవసరం. ఇక్కడ డయాబెటిస్ తో బాధపడేవారు డయాబెటిస్ ను కంట్రోల్ చేసుకోవడం కోసం చాలామంది అన్నానికి బదులుగా రాగిజావ ను తీసుకుంటున్నారు. రాగి జావతో డయాబెటిస్ బాధితులకు ప్రయోజనం కలుగుతుందా? అయితే రాగిజావ ని తీసుకోవడం మంచిదేనా? రాగి జావతో డయాబెటిస్ బాధితులకు ప్రయోజనం కలుగుతుందా అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. రాగులలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అంతేకాదు తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగి ఉంటుంది. అటువంటి రాగులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సహాయపడతాయి. రాగులలో ఉండే ఫైబర్ కారణంగా జీర్ణక్రియ మందగిస్తుంది. మధుమేహం ఉన్నవారికి ఇది మేలు చేస్తుందా? ఇది రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరగడానికి సహాయపడుతుంది. కాబట్టి ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుందని చెప్పవచ్చు. ఇక్కడ చెక్కర స్థాయిలను వేగంగా రాగులు పెంచకపోవడం వల్ల, మధుమేహం ఉన్నవారు నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. అయితే రాగిజావ ని తీసుకోవడంలో ఒక ప్రమాదం కూడా ఉంది. రాగి జావను మితంగా తీసుకుంటే అది మన బ్లడ్ షుగర్ లెవల్స్ ను కంట్రోల్ చేస్తుంది. మోతాదు కంటే ఎక్కువగా తీసుకుంటే డేంజర్ రాగి జావ ని తీసుకుంటే ఏమి కాదు అన్న ఉద్దేశంతో దానిని మోతాదు కంటే ఎక్కువగా తీసుకుంటే మళ్లీ అది మన బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరగడానికి కారణమవుతుంది. పచ్చ జొన్నలు, సజ్జలు, కొర్రలు, ఒండ్రు కొర్రలు వంటి వాటితో పోల్చి చూస్తే రాగులు కాస్త త్వరగా షుగర్ లెవెల్స్ పెంచుతాయని చెప్పవచ్చు. రాగిజావ తీసుకోవాలంటే ఇలా చెయ్యండి కాబట్టి రాగిజావ ని తీసుకోవాలనుకునే వారు మితంగా తీసుకుంటే మంచిది. మీ ఆహారంలో మీరు రాగిజావ ను చేర్చాలి అనుకుంటే, మీ డయాబెటిస్ కు సంబంధించి చికిత్స తీసుకుంటున్న వైద్య నిపుణులతో సంప్రదించి ఆయన సూచన మేరకు తీసుకోవడం మంచిది.

# ఒత్తిడి ఉపశమనం, ప్రశాంతమైన నిద్ర.. ఈ ఒక్కటి ట్రై చెయ్యండి!




వంటింట్లో వెల్లుల్లిని చాలా ప్రధానంగా భావిస్తాము. నిత్యం మనం చేసే వంటలలో కూడా వెల్లుల్లి పాత్ర చాలా ఉంటుంది. వెల్లుల్లిలో మన శరీరానికి ఆరోగ్యాన్నిచ్చే అనేక మంచి గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా వెల్లుల్లి నిద్రలేమి లక్షణాలను తగ్గించడంలో ఎంతగానో సహాయం చేస్తుంది. ఇటీవల జరిగిన అధ్యయనాలు వెల్లుల్లి యొక్క సహజ సమ్మేళనాలు నిద్ర నాణ్యతను మెరుగుపరచగలవని సూచిస్తున్నాయి. నిద్ర సమస్యలతో బాధపడుతున్న అనేక మంది వెల్లుల్లి తో నిద్రలో మెరుగుదలను చూసినట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. వెల్లుల్లి ప్రయోజనాలు వెల్లుల్లిలో విటమిన్లు అ, ః6, మాంగనీస్, మరియు కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్లు ఇ, ఐ వంటి అనేక ఖనిజాలు ఉంటాయి. ఇది కాకుండా, వెల్లుల్లిలో అల్లిసిన్ వంటి శక్తివంతమైన సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంటాయి. వెల్లుల్లిలో అలిసిన్ ఉంటుంది. ఇది వ్యాధినిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. మన ఇళ్ళలో ఉండే ఈ చిన్నగింజల్లో నూరు ఆరోగ్య ప్రయోజనాలు" వెల్లుల్లితో నిద్ర నాణ్యత.. అధ్యయన ఫలితాలు ఈ లక్షణాలు నిద్రలేమికి సాధారణ కారణాలైన ఒత్తిడి మరియు ఆందోళనను తగ్గించడంలో సహాయపడవచ్చు. అదనంగా, వెల్లుల్లి యొక్క యాంటీఆక్సిడెంట్లు మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహించగలవు, ఇది మెరుగైన నిద్రని ఇస్తుంది. అధ్యయనం ప్రకారం నిద్ర వ్యవధి మరియు నాణ్యతను మెరుగుపరచడంలో వెల్లుల్లి గణనీయమైన పాత్రను కలిగి ఉంది. రాత్రివేళ ఆహారంలో వెల్లుల్లిని చేర్చిన తర్వాత నిద్రపోయేవారు తక్కువ అంతరాయాలతో ఎక్కువ సేపు నిద్ర పోయారు.. అమృతం విషం" రాత్రి పడుకోబోయే ముందు వెల్లుల్లి మంచి నిద్రనిస్తుంది కనుక వెల్లుల్లి మన నిద్రకు దోహదం చేసే గొప్ప గుణాలు కలిగి ఉందని నమ్మవచ్చనే అభిప్రాయం ఉంది. రోజువారీ భోజనాలలో వెల్లుల్లిని చేర్చడం మంచిది. మన ఆరోగ్యానికి ఇది ఒక ఖర్చు తక్కువ విధానం. ఇది వివిధ వంటకాలలో వివిధ రకాలుగా ఉపయోగించవచ్చు. ఆహారంలో భాగంగా దీనిని తీసుకోవడం నిద్రకు మాత్రమే కాదు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలిగిస్తుంది. ఏది ఏమైనా రాత్రి పడుకోబోయే ముందు వెల్లుల్లిని తీసుకోవడం మంచి నిద్రకు దోహదం చేస్తుందని అధ్యయనం నిద్రలేమితో బాధపడే వారికి ఒక మంచి శుభవార్త చెప్పినట్టే భావించాలి.

# నిమ్మకాయ గింజలను తినొచ్చా... తింటే ఏమవుతుంది?

నిమ్మ గింజలలో ఫుల్ పోషకాలుఅయితే చాలామంది నిమ్మకాయలను వివిధ రకాలుగా ఆహారంలో భాగంగా చేయడానికి ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో వారు అందులో ఉండే నిమ్మ గింజలను పడేస్తూ ఉంటారు. కానీ నిమ్మ గింజలలో కూడా మన శరీరానికి ఉపయోగపడే బోలెడన్ని పోషకాలు ఉంటాయని వీటిని పారేయకుండా ఉంటేనే మంచిదని పలువురు చెబుతున్నారు. ఇక నిమ్మ గింజలతో మనకు ఎటువంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి తదితర వివరాలను ప్రస్తుతం తెలుసుకుందాం. నిమ్మ గింజలతో ఆరోగ్యంనిమ్మకాయ లోనే కాదు నిమ్మకాయ గింజలలో కూడా మంచి పోషకాలు ఉంటాయి. నిమ్మకాయ గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్ సి వంటి ముఖ్యమైన పోషకాలు మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. నిమ్మకాయ గింజల్లో ఉండే ఫ్లేవనాయిడ్ లు, విటమిన్ సి వంటి యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. నిమ్మకాయ గింజల్లో ఉండే ఫైబర్ కారణంగా మన జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. నిమ్మ గింజలతో ఈ ప్రయోజనాలు కూడానిమ్మకాయ గింజలు మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. మన చర్మ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం లోను, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలోనూ నిమ్మ గింజలు ఎంతగానో దోహదం చేస్తాయి. మూత్రపిండాల్లో రాళ్ళను నివారించడానికి, ఐరన్ శోషణకు నిమ్మకాయ గింజలు దోహదం చేస్తాయి. నిమ్మ గింజలు గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. ఇవి మన శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి బాగా తగ్గిస్తాయి. ఖనీజూజూఎ బవవటబ: ఈ చిన్నగింజలు చేసే మాయతో ఒత్తిడి మాయం, సుఖ నిద్ర ఖాయం!నిమ్మ గింజలను ఇలా తీసుకోకూడదుఅంతేకాదు బరువు తగ్గడానికి కూడా నిమ్మ గింజలు దోహదం చేస్తాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలను నివారించడంలోనూ, నిమ్మ గింజలు కొన్ని రకాల బ్యాక్టీరియాను నివారించడానికి, ఫంగల్ ఇన్ఫెక్షన్ నుంచి కాపాడడానికి ఉపయోగపడతాయి. కాకుంటే నిమ్మ గింజలను అతిగా తీసుకోకూడదు, మితంగా తీసుకుంటే నిమ్మ గింజలు కూడా మంచి ప్రయోజనాలనే ఇస్తాయి.







# 18 ఏళ్ల వయసులోనే ముద్దుగుమ్మ 'పెద్ద' పాత్రలు..!



బుల్లి తెరపై బాల నటిగా పలు సీరియల్స్‌లో నటించిన నితాన్షి గోయెల్ మంచి గుర్తింపు దక్కించుకుంది. చిన్నప్పటి నుంచి నటిగా ప్రేక్షకులను మెప్పిస్తూ వస్తున్న నితాన్షి ఇప్పుడు బాలీవుడ్ టాప్ హీరోయిన్స్ జాబితాలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తోంది. గత ఏడాది ఈమె నటించిన 'లపాటా లేడీస్' సినిమా వచ్చింది. ఆ సినిమా పై మొదట పెద్దగా అంచనాలు లేవు. కానీ ఎప్పుడైతే ప్రేక్షకుల ముందుకు వచ్చిందో, ఆస్కార్ వరకు జర్నీ సాంగించిందో అప్పటి నుంచి సినిమా గురించి ప్రముఖంగా మాట్లాడుకోవడం మొదలు అయింది. సినిమా గురించి వార్తలు వస్తున్న నేపథ్యంలో అందులో నటించిన నితాన్షి గోయెల్ గురించి కూడా జనాలు మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. తక్కువ సమయంలోనే దేశం మొత్తం నితాన్షి కి మంచి ఫాలోయింగ్, గుర్తింపు, గౌరవం దక్కింది అనడంలో సందేహం లేదు. లపాటా లేడీస్ ముద్దుగుమ్మ నితాన్షి గోయెల్ అమీర్ ఖాన్ నిర్మించిన లపాటా లేడీస్ సినిమాలో ఫూల్ కుమారి పాత్రలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. సీరియల్‌లో కనిపించిన ఈ చిన్నారి ఇప్పుడు ఇంత పెద్దగా అయిందా అని చాలా మంది షాక్ అయ్యారు. మొత్తానికి లపాటా లేడీస్ కారణంగా ఒక్కసారిగా ఈ అమ్మడికి స్టార్‌డం దక్కింది. ఆ స్టార్‌డం కారణంగా సినిమాల్లో ఆఫర్లు వస్తున్నాయి. మైదాన్ సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మైదాన్ సినిమాలో ఈమె చేసిన పాత్రకు సైతం ప్రశంసలు దక్కాయి. పాత్ర ఏదైనా నటిగా తన పూర్తి ఎఫర్ట్ పెట్టడం ద్వారా వార్తల్లో నిలుస్తున్న ముద్దుగుమ్మ ఫూల్ కుమారి తక్కువ సమయంలోనే బాలీవుడ్‌లో వరుస ఆఫర్లు సొంతం చేసుకుంటూ, బిజీ స్టార్‌గా దూసుకు పోతుంది. ఒక వైపు వెబ్ సిరీస్, మరో వైపు సినిమాల నుంచి ఈమెకు ఆఫర్లు వెల్లువెత్తుతున్నట్లుగా బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఆస్కార్ వరకు వెళ్లిన లపాటా లేడీస్ ఇటీవల ఈమె బాలీవుడ్ సీనియర్ స్టార్ సన్నీ డియోల్ నటించేందుకు ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. సిద్ధార్థ్ పి మల్హోత్ర దర్శకత్వంలో రూపొందబోతున్న యాక్షన్ థ్రిల్లర్ సినిమాలో సన్నీ డియోల్ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ మధ్య కాలంలో సన్నీ డియోల్ వరుసగా భారీ విజయాలను సొంతం చేసుకుంటున్నాడు. ఆయన పనైపోయింది అనుకుంటున్న సమయంలో లక్కీగా గదర్ 2 సినిమాతో ఒక్కసారిగా రీ ఎంట్రీ ఇచ్చినట్లు అయింది. ఆ సినిమా సూపర్ హిట్ సాధించడం మాత్రమే కాకుండా వందల కోట్ల వసూళ్లు నమోదు చేసింది. అందుకే సన్నీ డియోల్ తో సినిమాలకు బాలీవుడ్ స్టార్స్‌తో పాటు, ఫిల్మ్ మేకర్స్ క్యూ కడుతున్నారు. ఆయన సైతం దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఉద్దేశంతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు కమిట్ అవుతున్నాడు.



# చరణ్ - చిరు ఎమోషనల్ మూమెంట్.. అక్కడ బర్త్ డే సెలబ్రేషన్స్!

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ఈరోజు తన 70వ పుట్టిన రోజును ఘనంగా జరుపుకుంటున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఫ్యాన్స్, సినీ ప్రముఖులు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలుపుతుంటారు. అయితే ఈసారి మెగాస్టార్ ప్రత్యేకంగా తన కుటుంబ సభ్యులతో గోవా వెళ్లి బర్త్ డే సెలబ్రేట్ చేసుకుంటున్నారు. దీంతో ఈ వేడుక అక్కడే ఫ్యామిలీ అట్మాస్ఫియర్‌లో సాగుతోంది. చిరంజీవి పుట్టిన రోజు సందర్భంలో ఆయనతో పాటు రామ్ చరణ్, ఉపాసన, సాయితేజ్‌తో సహా కుటుంబ సభ్యులు అందరూ కలిసి గోవాలో వేడుకలను జరుపుకుంటున్నారు. ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో కేక్ కటింగ్ జరుగగా, ఆ వేడుకల్లో హుషారుగా ఉన్న వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ సందర్భంగా మెగాపవర్‌స్టార్ రామ్ చరణ్ ఓ స్పెషల్ వీడియోని షేర్ చేసి తండ్రి చిరంజీవికి ఎమోషనల్ విషెస్ తెలిపారు. వీడియోలో చరణ్ మొదట కేక్ తినిపించి, చిరు కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నాడు. ఆ తర్వాత తండ్రి కొడుకులిద్దరూ హగ్ చేసుకుని ఆప్యాయ క్షణాన్ని పంచుకున్నారు. చిరంజీవి కూడా చరణ్‌కు కేక్ తినిపించడం ఆ వీడియోని మరింత క్యూట్ గా మార్చింది. వీడియోతో పాటు రామ్ చరణ్ లవ్ ఇప్పుడు ఫ్యాన్స్‌ను ఫుల్ ఎమోషనల్ చేస్తోంది. "ఇది కేవలం మీ పుట్టినరోజు మాత్రమే కాదు నాన్న, ఇది మీలాంటి వ్యక్తికి ఒక అద్భుతమైన వేడుక. నా హీరో, నా గైడ్, నా ప్రేరణ మీరే. నేను సాధించిన ప్రతి విజయం, నేర్చుకున్న ప్రతి విలువ మీ నుండే వచ్చింది. 70 ఏళ్ల వయసులో కూడా మీరు హృదయంలో యవ్వనంగా, స్ఫూర్తిదాయకంగా ఉన్నారు. మీ ఆరోగ్యం, ఆనందం ఎప్పటికీ ఇలాగే ఉండాలి" అని పేర్కొన్నారు.చరణ్ ఈ స్పెషల్ వీడియో షేర్ చేయగానే అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా ఫ్యాన్స్ ఆ వీడియోని షేర్ చేస్తూ తండ్రి కొడుకుల బంధాన్ని ఎమోషనల్‌గా సెలబ్రేట్ చేస్తున్నారు. ఇక సినిమాకు విషయానికి వస్తే నెక్స్ట్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్న మన శంకరవర ప్రసాద్ గారు.. అనే సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. ఆ తరువాత సమ్మర్ కు విశ్వంభర రానుంది.




# అనుష్క.. భలే ఛాన్సులే

: తెలుగులో హీరోలతో సమానంగా స్టార్ ఇమేజ్, మార్కెట్ సంపాదించిన కథానాయికల్లో అనుష్క ఒకరు. అరుంధతి, రుద్రమదేవి, భాగమతి లాంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో ఆమె రేపిన సంచలనాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఐతే 'బాహుబలి' తర్వాత అనుష్క ఇంతకుముందులా రెగ్యులర్‌గా సినిమాలు చేయట్లేదు. కొన్నేళ్ల గ్యాప్ తర్వాత 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో పలకరించిన ఆమెకు మంచి విజయమే దక్కింది. కానీ మళ్లీ గ్యాప్ తప్పలేదు. ఇప్పుడు ఆమె నుంచి 'ఘాటి' అనే ఇంటెన్స్ మూవీ రాబోతోంది. విలక్షణ దర్శకుడు క్రిష్ డైరెక్ట్ చేసిన చిత్రమిది. ఈ సినిమా ఎప్పుడో రా?వాల్సింది. ఆలస్యమై సెప్టెంబరు 5న ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమైంది. ఐతే కొంచెం లేటైనప్పటికీ.. ఈ సినిమాకు మంచి టైమింగే కుదిరింది. 'మిరాయ్' లాంటి క్రేజీ మూవీతో పోటీ పడాల్సిన సినిమాకు కాస్త సోలో డేట్ ఖరారైంది. సెప్టెంబరు 5కే అనుకున్న 'మిరాయ్' వాయిదా పడిపోయింది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నా.. ఈ సినిమా పోటీ నుంచి తప్పుకుందన్నది స్పష్టం. ముందు వారం రావాల్సిన మాస్ రాజా రవితేజ చిత్రం 'మాస్ జాతర' కూడా వాయిదా పడింది. ఇండిపెండెన్స్ డే వీకెండ్ చిత్రాలు వార్-2, కూలీ ఆల్రెడీ డౌన్ అయిపోయాయి. 'ఘాటి' వచ్చే సమయానికి బాక్సాఫీస్ ఖాళీగా ఉంటుంది. ఇంత అనుకూల వాతావరణం 'ఘాటి'కి బా?గా ప్లస్ అవుతుందనడంలో సందేహం లేదు. ట్రైలర్ చూస్తే 'ఘాటి' బలమైన కంటెంట్ ఉన్న సినిమాలాగే కనిపిస్తోంది. క్రిష్ దర్శకత్వ ప్రతిభకు, అనుష్క స్టార్ పవర్ తోడైతే.. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర అద్భుతాలు చేయడానికి అవకాశముంది. మరి ఈ గోల్డెన్ ఛాన్స్‌ను 'ఘాటి' ఎంతమేర ఉపయోగించుకుంటుందో చూడాలి.



# తనలానే క్లీంకారనీ చూడాలనుకున్నా



సాధారణ మహిళల దగ్గర నుంచి సెలబ్రిటీల వరకు పిల్లల విషయంలో అందరూ ఒకేలా ఆలోచిస్తారు. తమ విషయంలో ఎలా ఉన్నా పిల్లల విషయంలో ఎన్నో జాగ్రత్తలు పడుతూ, వారి ఆరోగ్యాన్ని కాపాడుతూ, వారికి కావాల్సినవన్నీ సమకూరుస్తూ ఉంటారు. ఆహారం విషయంలో ఈ జాగ్రత్తలు మరింత ఎక్కువగా పాటిస్తూ ఉంటారు తల్లులెవరైనా. అందులో భాగంగానే తాము రెగ్యులర్ గా తీసుకునే ఆహారాన్ని తమ పిల్లలకు కూడా అలవాటు చేస్తూ వారిని మరింత స్ట్రాంగ్ గా తయారుచేయాలనుకుంటారు. మెగా కోడలు ఉపాసన కూడా తన కూతురు క్లీంకార ఆహారం విషయంలో ఇలానే ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటానని చెప్తున్నారు. కొణిదెల కుటుంబానికి వారసురాలైన క్లీంకార ఫేస్ ను ఇంకా రివీల్ చేయకపోయినప్పటికీ, ఈ చిన్నారి పుట్టినప్పటినుంచి వార్తల్లో నిలుస్తూనే ఉంది. క్లీంకార ఫుడ్ విషయంలో ఉపాసన కేర్ తాజాగా ఉపాసన ఓ సందర్భంలో తన కూతురి ఫుడ్ విషయంలో తాను తీసుకునే జాగ్రత్తల గురించి వెల్లడించారు. చిన్నప్పట్నుంచి తనకు రాగులు అంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆ సూపర్ ఫుడ్ ను తన కూతురికి కూడా అలవాటు చేశానని చెప్తున్నారు ఉపాసన. ప్రతీరోజూ క్లీంకారకు రాగుల్ని తినిపిస్తానని చెప్పిన ఉపాసన నీ కూతురికి రోజూ ఏదో రూపంలో రాగుల్ని తినిపించు అని సద్గురు జగ్గీ వాసుదేవ్ చెప్పారని ఉపాసన తెలిపారు. జగ్గీ వాసుదేవ్ కూతురు రాధే జగ్గీ కూడా నాన్న మాకు రోజూ రాగి జావ తాగించేవారని, ఇప్పటికీ తాను తనతో చెప్పిందని, దాని వల్లే రాధే చాలా హెల్తీగా, ఫిట్‌గా ఉంటారని, రాధే లానే తన కూతురిని కూడా హెల్తీగా, ఫిట్ గా చూడాలనుకుని క్లీంకార రెగ్యులర్ డైట్ లో రాగుల్ని చేర్చినట్టు ఉపాసన తెలపగా ప్రస్తుతం ఉపాసన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**